CIRCULATED IN HYDERABAD, SIDDIPET, SANGAREDDY, KARIMNAGAR, WARANGAL, KAMMAM, NIZAMABAD, MAHABOOBNAGAR, KURNOOL, VIJAYAWADA, GUNTUR, RAJAHMUNDRY, VIZAG.



### మేడిగడ్డ నిర్మాణంలో ఎన్నో

# లోపాలున్నాయి

- భారాస నేతలకు ఏటీఎంలా కాళేశ్వరం ప్రాజెక్టు
- తెలంగాణ ప్రజలకు వాస్తవాలు తెలియాలి
- రెండు మూడు రోజుల్లో శ్వేత పత్రం విడుదల చేస్తాం
- మేడిగడ్డ బ్యారేజ్ ను కళ్లారా చూశాకే.. నివేదికపై చర్చిస్తాం
- కేసీఆర్ కూడా మేడిగడ్డకు రావాలి
- హెలికాప్టర్ సిద్ధంగా ఉంది
- హరీష్ రావు కూడా మేడిగడ్డకు రావాలి
- అసెంబ్లీ సమావేశాల్లో సీఎం రేవంత్ రెడ్డి

2వ పేజీలో...



### అహ్లాన్ మోడీకి 65 వేల

# రిజిస్ట్రేషన్లు

న్యూఢిల్లీ, : మన దేశంలోనే కాదు విదేశాల్లో కూడా ప్రధాని నరేంద్ర మోడీకి మంచి ఆదరణ ఉంది. యూఏఈలో జరగబోయే 'అహ్లాన్ మోదీ' కార్యక్రమానికి సంబంధించిన రిజిస్ట్రేషన్లను పరిశీలిస్తే ఇది స్పష్టమవుతుంది. ఈ కార్యక్రమానికి హాజరయ్యేందుకు ఏకంగా 65 వేల మంది తమ పేర్లు నమోదు చేసుకున్నారు. ఫిబ్రవరి 13న అంటే నేడు యూఏఈలో జరిగే 'అహ్లాన్ మోదీ' కార్యక్రమంలో ప్రవాస భారతీయులను ఉద్దేశించి ప్రధాని మోదీ ప్రసంగించనున్నారు. ఇండియన్ పీపుల్ ఫోరమ్ ప్రెసిడెంట్, 'అహ్లాన్ మోడీ' ఇనిషియేటివ్ హెడ్ జితేంద్ర వైద్య ఈ ఈవెంట్ గురించి మీడియాకు తెలిపారు.

2వ పేజీలో...



### ఇది రాజకీయ సభ కానేకాదు..

# పోరాట సభ

- ఆరు నూరైనా తెలంగాణకు అన్యాయం జరగనివ్వను
- కృష్ణా జలాలకై చావో రేవో తేల్చుకోవాల్సిన సమయం
- నీళ్లు లేకపోతే తెలంగాణ ప్రజలకు బతుకు లేదు
- 24 ఏళ్లుగా పక్షిలాగా తిరిగి రాష్ట్రం మొత్తం చెప్పాను
- తెరాస ప్రభుత్వం వచ్చాకే ఫ్లోరైడ్ సమస్య పోయింది
- ఇప్పుడు నల్గొండ జిల్లా ఫ్లోరైడ్ రహిత జిల్లాగా మారింది
- నల్లగొండ సభలో భారాస అధినేత కేసీఆర్
- అన్యాయాన్ని ఊరుకునేది లేదు
- చివరిశ్వాస వరకు పులిలా కొట్లాడతా
- బతుకనివ్వం.. వెంటపడుతం.. వేటాడుతం..!
- కాంగ్రెస్ సర్కారుకు కేసీఆర్ హెచ్చరిక

నల్లగొండ యదార్థవాది ప్రతినిధి ఫిబ్రవరి 13: నల్లగొండ వేదికగా బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కే చంద్రశేఖర్ రావు కాంగ్రెస్ పార్టీపై నిప్పులు చెరిగారు. పదవులు శాశ్వతంకాదు.. తెలంగాణ ప్రజల హక్కులు శాశ్వతం.. అధికారం ఉన్నా లేకున్నా ప్రజల పక్షానే ఉంటాం.. అంటూ కేసీఆర్ పేర్కొన్నారు. కృష్ణా జలాల్లో తెలంగాణ వాటా కోరుతూ బీఆర్ఎస్ పార్టీ నల్లగొండలో నిర్వహించిన భారీ బహిరంగ సభలో కేసీఆర్ ప్రసంగించారు. ఈ సందర్భంగా అధికార కాంగ్రెస్‌కు వార్నింగ్‌లు ఇచ్చారు గులాబీ బాస్. ఇచ్చిన హామీలు అమలు చేయాల్సిందేనని అప్పటిదాకా వెంటపడి కొట్లాడుతామన్నారు. వేటాడుతామన్నారు. రైతు బంధు నుంచి పంట బోనస్‌ల దాకా దేన్నీ వదలబోమన్నారు. తెలంగాణకు అన్యాయం జరిగితే ఊరుకునేది లేదని.. చివరి శ్వాస వరకు పులిలా కొట్లాడతా అంటూ కేసీఆర్ పేర్కొన్నారు. కాంగ్రెస్‌కు పదవులు తప్ప ప్రజల సమస్యలు పట్టవంటూ విమర్శించారు. రైతులను చెప్పుతో కొడుతావా..? తెలంగాణ తెచ్చిన కేసీఆర్‌నే తిరగనివ్వరా..? ఎన్ని గుండెలు మీకు అంటూ కేసీఆర్ కాంగ్రెస్ పై ధ్వజమెత్తారు. ప్రజలకు తన మీద ఏం కోపం వచ్చిందో తెలియదు కానీ.. పాలిచ్చే అవును వదిలేసి దున్నపోతును తెచ్చుకున్నారని కేసీఆర్ కామెంట్ చేశారు. తెలంగాణ వచ్చిన తరువాత విద్యుత్ కోతలు లేకుండా చూశామని కేసీఆర్ అన్నారు. తాము అధికారం నుంచి దిగిపోయిన వెంటనే కరెంట్ కోతలు మొదలయ్యాయని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి కేసీఆర్‌ను తిట్టడమే పనిగా పెట్టుకున్నారని గులాబీ బాస్ మండిపడ్డారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదని.. తెలంగాణ హక్కులు శాశ్వతమని అన్నారు. రైతుబంధు అడిగితే చెప్పుతో కొట్టాలన్న వారిని చెప్పుతో కొట్టాలని కేసీఆర్ అన్నారు. ఇష్టమొచ్చినట్టు మాట్లాడవద్దని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. మేడిగడ్డ దగ్గర ఇప్పటికీ నీళ్లు ఉన్నాయని.. దమ్ముంటే వాటిని రైతులకు అందివ్వాలని కేసీఆర్ డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ అంటే ఆటబొమ్మ కాదని అన్నారు. రెండు మూడు పిల్లర్లు కుంగిపోతే వాటిని సరి చేయాలని సూచించారు. కృష్ణా నదిలో



### ప్రాజెక్టుల పేరుతో

# దోచుకున్నారు

మహదేవపూర్ యదార్థవాది ప్రతినిధి ఫిబ్రవరి 13: కాళేశ్వరం ప్రాజెక్టు కోసం రూ.లక్ష కోట్లు ఖర్చుపెట్టినా లక్ష ఎకరాలకు కూడా నీరు అందలేదని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. మేడిగడ్డ బ్యారేజీలో దెబ్బతిన్న ఏడో బ్లాక్‌లోని పియర్స్‌ను మంగళవారం సాయంత్రం ప్రజాప్రతినిధుల బృందం పరిశీలించింది. అనంతరం కాళేశ్వరం ప్రాజెక్టు స్థితిగతులపై ఇన్‌ఛార్జి చీఫ్ ఇంజినీర్ సుధాకర్‌రెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. గతేడాది అక్టోబరు 21న మేడిగడ్డ పిల్లర్లు కుంగాయని ఇంజినీర్లు వివరించారు.

- కాళేశ్వరంకోసం రూ.లక్ష కోట్లు ఖర్చు
- లక్ష ఎకరాలకు కూడా నీరు అందలేదు
- నిర్మాణంలో నాణ్యతాలోపం ఉంది
- డ్యామ్ సేఫ్టీ అథారిటీ చెప్పినప్పటికీ చక్కదిద్దలేదు
- ప్రాజెక్టుకు ఏటా విద్యుత్ బిల్లులే రూ. 10,500 కోట్లు
- మేడిగడ్డను ఎవరూ చూడకుండా కేసీఆర్ కప్పిపుచ్చారు
- రీడిజైన్ పేరుతో కాళేశ్వరం చేపట్టి భారీగా అవినీతి
- ప్రజా కోర్టులో చర్చిద్దామని ఆహ్వానించాం
- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



2వ పేజీలో...

### మంత్రి పదవికి సెంథిల్ బాలాజీ

# రాజీనామా..

చెన్నై: తమిళనాడు మంత్రి సెంథిల్ బాలాజీ తన పదవికి రాజీనామా చేశారు. మనీలాండరింగ్ కేసులో అరెస్టయిన ఆయన ప్రస్తుతం జైలులో ఉన్న విషయం తెలిసిందే. అయితే బెయిల్ కోసం ఆయన దాఖలు చేసిన పిటిషన్ మరో రెండు రోజుల్లో మద్రస్ హైకోర్టు ముందుకు రానున్నది. ఈ నేపథ్యంలో సెంథిల్ మంత్రి పదవికి రాజీనామా చేయడం గమనార్హం.



### రైతన్నలను ఇబ్బంది పెట్టాలని చూస్తే

## కేంద్రానికి టికాయత్ హెచ్చరిక

న్యూఢిల్లీ, : తమ డిమాండ్ల పరిష్కారం కోసం దిల్లీ బయలుదేరిన రైతులకు సమస్యలు సృష్టిస్తే.. చూస్తూ ఉండిపోమని భారతీయ కిసాన్ యూనియన్‌చీఫ్ రాకేశ్ టికాయత్ హెచ్చరించారు. 'దేశంలో అనేక రైతు సంఘాలు ఉన్నాయి.

2వ పేజీలో...



### పంజాబ్–హర్యానా

2వ పేజీలో...

# బోర్డర్ లో యుద్ధ వాతావరణం

### దేశ రాజధానిలో మరోసారి కదంతొక్కిన రైతులు

న్యూఢిల్లీ, : దేశ రాజధానిలో రైతులు మరోసారి కదం తొక్కారు. కేంద్రం గతంలో ఇచ్చిన డిమాండ్లను నెరవేర్చాలని కోరతూ ఢిల్లీ చలోకి పిలుపునిచ్చారు. మొదట డిమాండ్ల పరిష్కారానికి రెండు దఫాలుగా చర్చలు జరిపారు. కానీ, చర్చలు విఫలం కావడంతో భారీస్థాయిలో ఆందోళన చేపట్టేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు.



2వ పేజీలో...

- ఒక బ్యారేజీ పిల్లర్లు కుంగితే ఇష్యూ చేస్తున్నారు
- శాసనసభలో సభా సంప్రదాయాలను ఉల్లంఘిస్తున్నారు
- ప్రధాన ప్రతిపక్షానికి మైక్ ఇవ్వకపోవడం అప్రజాస్వామికం

మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు ఆగ్రహం

### కాళేశ్వరం అంటే ఒక్క మేడిగడ్డ

# బ్యారేజే కాదు

హైదరాబాద్ యదార్థవాది ప్రతినిధి ఫిబ్రవరి 13: శాసనసభలో సభా సంప్రదాయాలను ఉల్లంఘించారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు ఆగ్రహం వ్యక్తంచేశారు. అధికారపక్షం మాట్లాడిన తర్వాత ప్రతిపక్షానికి అవకాశం ఇవ్వకపోవడం సభా సంప్రదాయాలకు విరుద్ధమని చెప్పారు. మేడిగడ్డ పర్యటన ద్వారా తమపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, సబితా ఇంద్రారెడ్డితో కలిసి హరీశ్ రావు మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టు వల్ల లబ్ధిపొందిన ప్రజలను అడగాలని ప్రభుత్వానికి సూచించారు. పార్లమెంటు ఎన్నికల్లో లబ్ధిపొందేందుకు కాళేశ్వరాన్ని వాడుకుంటున్నారని చెప్పారు.

రావాలని కోరారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అడ్డుతగిలారు. సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. మేడిగడ్డపై అధికారులు ఇచ్చిన నివేదికను చర్చించాలంటే ముందు వాస్తవ పరిస్థితులను తెలుసుకోవాలన్నారు. మేడిగడ్డ నిర్మాణ లోపం వల్ల కుంగిందా, ఇసుకలో పేకమేడ కడితే కుంగిందా ? బాంబులు వేయడంతో కుంగిందా అన్నది చూసి తెలుసుకోవచ్చన్నారు. కేసీఆర్ సృష్టించిన అద్భుతం గురించి.. ఆయనే సభ్యులకు వివరిస్తే బాగుంటుందన్నారు. మేడిగడ్డ బ్యారేజ్ ను కళ్లారా చూశాకే.. నివేదికపై చర్చిస్తామన్నారు. కేసీఆర్ కూడా మేడిగడ్డకు రావాలని.. ఆయన కోసం ప్రత్యేకంగా హెలికాప్టర్ ను సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. హరీష్ రావు కూడా మేడిగడ్డకు రావాలని కోరుతున్నామన్నారు. రాష్ట్రంలో నిర్మించిన ప్రాజెక్టుల్లో అవినీతి జరిగిందని సీఎం రేవంత్ పేర్కొన్నారు. మేడిగడ్డలో అసలేం జరిగిందో ప్రజలకు నిజాలు తెలియాలన్నారు. డ్యామ్ డిజైన్ లో చాలా తప్పులున్నాయి. కాంగ్రెస్ హయాంలో కట్టిన పలు ప్రాజెక్టులు ఇప్పటికీ దృఢంగా ఉన్నాయని, ఇటీవల కట్టిన ప్రాజెక్టులు ఎందుకు కుంగిపోతున్నాయని ప్రశ్నించారు. సాగునీటి ప్రాజెక్టులు ఆధునిక దేవాలయాలని, అలాంటి ప్రాజెక్టులను సరిగ్గా నిర్మించనిపక్షంలో నష్టపోయేది మనమేనన్నారు. బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ ఖజానా డబ్బు చాలా వృథా అయిందని, ఇష్టారాజ్యంగా ప్రాజెక్టులను నిర్మించి.. అభివృద్ధి చేశామని ప్రజల్ని మోసం చేశారని సీఎం రేవంత్ విమర్శించారు. సాగునీటి ప్రాజెక్టులు ఆధునిక దేవాలయాలని పెద్దలు చెప్పారని సీఎం రేవంత్‌రెడ్డితెలిపారు. దేవాలయాలు ఎంత పవిత్రమైనవో.. రైతులకు ప్రాజెక్టులూ అంతేనని చెప్పారు. ఐదో రోజు అసెంబ్లీ సమావేశాల్లో స్వల్పకాలిక చర్చలో ముఖ్యమంత్రి మాట్లాడారు."తెలంగాణకు ప్రధానంగా తాగు, సాగునీటి కోసం రెండు వనరులున్నాయి. అవి కృష్ణా, గోదావరి జలాలు. కృష్ణా జలాలపై ఇప్పటికే కొంత మేర శాసనసభలో చర్చించాం. వాస్తవాలను రాష్ట్ర ప్రజలకు వివరించగలిగాం. ఇక రెండోది గోదావరి జలాలు. తెలంగాణను సస్యశ్యామలం చేసేందుకే ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును చేపట్టాలని గతంలో పాలకులు నిర్ణయం తీసుకున్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని ఈ ప్రాజెక్టును ప్రారంభించారు.

అంచనాలు ఎలా పెంచారు? రీడిజైనింగ్ ఎలా చేశారు? అందులో సాంకేతికపరమైన అంశాలు ఏమున్నాయి? రీడిజైనింగ్‌కు సంబంధించి నిపుణులు ఇచ్చిన డీపీఆర్ ఎక్కడ?అ తర్వాత జరిగిన నిర్మాణం, నిర్వహణ.. ఇవన్నీ ఇప్పటికీ ప్రశ్నల్లాగే మిగిలాయి.మేడిగడ్డ బ్యారేజీ కింద ఇసుక కదలడం వల్లే కుంగిపోయిందని గత ప్రభుత్వంలో నేతలు అన్నారు. రూ.వేల కోట్లు ఖర్చు చేశారు. ఇంత జరిగితే.. బ్యారేజీ వద్దకు ఎవరూ వెళ్లకుండా.. చూడనీయకుండా పోలీసు పహారా పెట్టారు. భారత్-పాక్ సరిహద్దు వద్ద కూడా అ స్థాయిలో సెక్యూరిటీ ఉంటుందని నేను అనుకోవడం లేదు. ఫిర్యాదులు అందడంతో కేంద్ర ప్రభుత్వం రంగంలోకి దిగింది. ప్రాజెక్టు పరిస్థితి ఏంటనే వివరాలతో కూడిన నివేదికను నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ ఇచ్చింది. చివరకు ఆ నివేదికనూ గత ప్రభుత్వం తప్పుబట్టింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత.. మేడిగడ్డ వద్ద జరుగుతున్న పరిస్థితుల నేపథ్యంలో కొంతమంది అధికారులు కార్యాలయాల నుంచి ఫైళ్లు మాయం చేశారని పెద్ద ఎత్తున టీవీలు, పత్రికల్లో వచ్చింది. దీంతో తక్షణమే మేడిగడ్డ, అన్నారం బ్యారేజీల వద్ద జరిగిన అవకతవకలపై విచారణకు అదేశించాం. విజిలెన్స్ కమిటీ ప్రాథమికంగా ఓ నివేదిక ఇచ్చింది. బ్యారేజీ నిర్మాణంలో తీసుకున్న నిర్ణయాలు, నిర్వహణలో నిర్లక్ష్యం సహా అనేక విషయాలను అందులో ప్రస్తావించింది. ఇప్పటికీ బ్యారేజీ వద్ద ఏం జరిగిందో ఎవరికీ తెలియదు. కొంతమంది సీనియర్లు ఉన్నప్పటికీ వారికి పూర్తి అవగాహన ఉందో లేదో తెలియదు. అందుకే ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అందరినీ బ్యారేజీ సందర్శనకు రావాలని కోరాం. అదే జరిగితే అక్కడి వాస్తవ పరిస్థితులు ప్రతి ఒక్కరికీ తెలుస్తాయి. కాళేశ్వరం ప్రాజెక్టు ఎంతో గొప్పది.. అద్భుతం.. అని ప్రచారం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు భారాస నేతలకు ఏటీఎంలా మారిందని.. వారి ఇళ్లల్లో కనకవర్షం కురిసిందని మేం అనడం లేదు. తెలంగాణ ప్రజలకు వాస్తవాలు తెలియాలి. అదొక్కటే మా ఉద్దేశం. ప్రాజెక్టుల వద్ద ఉన్న వాస్తవ పరిస్థితులను పరిశీలించి రెండు మూడు రోజుల్లో శ్వేత పత్రం విడుదల చేస్తాం" అని రేవంత్ రెడ్డి వివరించారు.

ఢిల్లీ చుట్టుపక్కల రాష్ట్రాల రైతులంతా.. ఢిల్లీకి ర్యాలీగా బయల్దేరగా.. పోలీసులు ఎక్కడికక్కడ అరెస్టులు చేశారు.ఉదయం 10 గంటలకు పంజాబ్ లోని ఫతేగఢ్ సాహిబ్ నుంచి వేలాదిమంది రైతులు ట్రాక్టర్లతో ఢిల్లీకి బయల్దేరారు. రైతుల్ని అడ్డుకునేందుకు పోలీసులు బారికేడ్లను ఏర్పాటు చేశారు. ఢిల్లీ సరిహద్దుల్లో రైతుల ఆందోళనను భగ్నం చేసేందుకు అత్యంత కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయడంతో.. ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పంజాబ్, హర్యానా సరిహద్దుల్లో యుద్ధవాతావరణం కనిపిస్తోంది. రైతులను చెదరగొట్టేందుకు శంభు బోర్డర్ లో టియర్ గ్యాస్ ను ప్రయోగించారు. ఢిల్లీ అంతటా 144 సెక్షన్ అమల్లో ఉంది. ఎర్రకోట వద్ద కూడా పరిస్థితి ఉద్రిక్తంగా ఉండటంతో భారీగా భద్రతా బలగాలు చేరుకున్నాయి. ఢిల్లీకి చేరుకునే అన్ని మార్గాల్లోనూ భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. కాగా.. ఢిల్లీ చలో కార్యక్రమాన్ని విరమించుకోవాలని కోరుతూ కేంద్రం రైతుసంఘాల నేతలతో చండీగఢ్ లో నిన్న చర్చలు జరిపింది. అర్ధరాత్రి వరకూ జరిగిన ఈ చర్చలు విఫలమయ్యాయి. కేంద్ర మంత్రులు పీయూష్ గోయల్, అర్జున్ ముండా.. రైతుల సంఘాల నేతలతో సమాలోచనలు జరిపారు. 2020-21లో రైతుల ఆందోళనలు చేసిన రైతులపై కేసుల ఉపసంహరణకు సెంట్రల్ టీం అంగీకరించింది. అప్పటి ఆందోళనల్లో మరణించిన రైతుల కుటుంబాలకు ఇంకా ఎవరికైనా పరిహారం దక్కకపోతే వారికీ పరిహారం చెల్లిస్తామని హామీ ఇచ్చింది. కానీ, కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలని రైతు నాయకులు

ఇటుకలు, రాళ్లు, పెట్రోల్ వంటి వాటిని ఎవరూ తీసుకుని రాకూడదని స్పష్టం చేశారు. ఇక.. లౌడ్ స్పీకర్ల వాడకంపైనా ఈ ఆంక్షలు విధించారు. ఇప్పటికే బారీ కేడ్లు పెద్ద ఎత్తున ఏర్పాటు చేశారు. అనుమతి లేకుండా ఎవరినీ ఢిల్లీలోకి అనుతించడం లేదు. ఢిల్లీ హర్యానా సరిహద్దులను మూసివేశారు.

రహదారిపై ఇసుక సంచులు, ముళ్ల కంచెలు, కాంక్రీటు దిమ్మెలను అడ్డుగా పెట్టారు. హర్యానా పోలీసులు టియర్ గ్యాస్ మాక్ డ్రిల్‌ను కండక్ట్ చేశారు. డ్రోన్ల సాయంతో టియర్ గ్యాస్ ప్రయోగించారు. పలు ప్రాంతాల్లో డ్రోన్లతో పరిస్థితులను పర్యవేక్షిస్తున్నారు. ఇప్పటికే ఢిల్లీ వైపుగా వెళ్తున్న ఎక్కడిక్కడ పోలీసులు అదుపులోకి తీసుకుంటున్నారు. కర్ణాటక నుంచి వెళ్తున్న 100 మంది రైతులను భోపాల్‌లో రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. చలో ఢిల్లీ కార్యక్రమానికి రైతులు పెద్ద ఎత్తున హాజరవుతున్నారని నిఘావర్గాలు అనుమానిస్తున్నారు. దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల నుంచి కనీసం 20 వేలమంది రైతులు వస్తారని అంచనా వేస్తున్నారు. ఆందోళనలు ఎలా చేపట్టాలనే దానిపై రైతుల సంఘాలు రిహార్సల్స్ కూడా నిర్వహించారు. పంజాబ్‌లో 30 సార్లు, హరియాణాలో 10 సార్లు రిహార్సల్స్ జరిగాయని నిఘా వర్గాలకు సమాచారం ఉంది. 2000 వేల ట్రాక్టర్లతో ఢిల్లీని చుట్టు ముట్టాలని రైతులు ప్లాన్ చేశారు. అయితే, ఆంక్షల సుడిగుండాన్ని దాటుకొని ఆందోళనలు కొనసాగిస్తారా? లేదా అని ఉత్కంఠ నెలకొంది.

# ప్రాజెక్టుల పేరుతో దోచుకున్నారు

మొదటిపేజీ తరువాయి...

ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. లక్ష ఎకరాలకు నీరు అందక పోయినా.. కేసీఆర్ మాత్రం కోటి ఎకరాలకు నీరు ఇచ్చామని గొప్పలు చెప్పారని విమర్శించారు. నిర్మాణంలో నాణ్యతాలోపం ఉందని డ్యామ్ సేఫ్టీ అథారిటీ చెప్పినప్పటికీ.. సమస్యను చక్కదిద్దే పని చేయకుండా నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు ఏటా విద్యుత్ బిల్లులే రూ.10,500 కోట్లు వస్తున్నాయని తెలిపారు. ప్రాజెక్టు రుణాలు, ఇతర ఖర్చులు కలిపి ఏటా రూ. 25వేల కోట్లు అవసరమవుతాయని వివరించారు. "కుంగిన మేడిగడ్డను ఎవరూ చూడకుండా కేసీఆర్ కప్పిపుచ్చారు. ఈసీ అనుమతి పొంది రాహుల్ గాంధీ, నేను మేడిగడ్డను పరిశీలించాం. జరిగిన అవకతవకలపై నీటిపారుదల శాఖ మంత్రి విచారణకు అదేశించారు. కాళేశ్వరం నిర్మాణం, నిర్వహణలో భారీగా లోపాలు ఉన్నాయని విజిలెన్స్ కమిటీ చెప్పింది. రీడిజైన్ పేరుతో కాళేశ్వరం చేపట్టి భారీగా అవినీతికి పాల్పడ్డారు. తన బండారం బయటపడుతుందని కేసీఆర్ గ్రహించారు. అవినీతి బయటపడకుండా ప్రజల దృష్టి మళ్లించేందుకే నల్గొండలో సభ పెట్టారు. చావు నోట్లో తల పెట్టానని కేసీఆర్ పదే పదే అంటున్నారు. అలా అని భావించే ప్రజలు రెండుసార్లు అవకాశం ఇచ్చారు. ప్రజలు రెండుసార్లు అవకాశం ఇస్తే.. ప్రాజెక్టుల పేరుతో దోచుకున్నారు. కాళేశ్వరంపై ప్రజల అనుమానాలు నివృత్తిచేయాలని ప్రభుత్వం భావించింది. శాసనసభ, ప్రజా కోర్టులో చర్చిద్దామని ఆహ్వానించాం. కాలు విరిగిందని శాసనసభకు రాలేని కేసీఆర్.. నల్గొండ సభకు ఎలా వెళ్లారు. కేసీఆర్ దోపిడీకి కాళేశ్వరం బలైపోయింది. అడిగితే సలహాలు ఇస్తానన్న కేసీఆర్ ..కేఆర్ఎంబీపై చర్చ పెడితే అసెంబ్లీకి ఎందుకు రాలేదు. సభలో చేసిన తీర్మానం చక్కగా లేదని విమర్శిస్తున్నారు. అలాంటి తీర్మానానికి హరీశ్‌రావు ఎందుకు మద్దతిచ్చారు. ఆయన మాటలకు విలువ లేదా? కేసీఆర్ బెదిరించి బతకాలని చూస్తున్నారు. సీఎం కుర్చీ పోగానే.. నీళ్లు, ఫ్లోరైడ్ బాధితులు గుర్తొచ్చారా? కాలు విరిగిందని సాను భూతితో ఓట్లు పొందాలని చూస్తున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు వద్దకు వచ్చేందుకు కేసీఆర్ ఎందుకు భయపడుతున్నారు. రూ.వేల కోట్లతో నిర్మించిన ప్రాజెక్టు కుంగితే చిన్న విషయంగా మాట్లాడుతున్నారు. ఏముంది చిన్న పిల్లర్లు కుంగాయని తేలికగా మాట్లాడుతున్నారు. కృష్ణా ప్రాజెక్టులను కేంద్రానికి అప్పగించింది కేసీఆరే. ప్రాజెక్టులను కేంద్రం నిర్వహించేందుకు గత ప్రభుత్వం నిధులు కూడా ఇచ్చింది. సాగునీటి శాఖపై అసెంబ్లీలో శ్వేతపత్రం పెడతాం.. కేసీఆర్ వచ్చి మాట్లాడాలి. ప్రజల కోసం బయటికి వెళ్లే అలవాటు కేసీఆర్‌కు ఏనాడూ లేదు. ఎంపీ ఎన్నికల్లో కొన్ని ఓట్లు తెచ్చుకునేందుకు కొత్త ఎత్తుగడ ఎత్తుకున్నారు" అని రేవంత్‌రెడ్డి విమర్శించారు. మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వరావుతో పాటు పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ఎంఐఎం నేతలు ప్రాజెక్టును పరిశీలించిన వారిలో ఉన్నారు. మేడిగడ్డ బ్యారేజ్ వంతెన కుంగిందని వార్తలు రాగానే తొలుత బీఆర్ఎస్ నేతలు స్పందించలేదు. ఏమీ పట్టనట్టు వ్యవహరించారు. ఆ ప్రాజెక్టుకు ఏమీ నష్టం జరగలేదని అన్నట్టు కిమ్మనకుండా ఉన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఎన్నికల ప్రచారం మొదలుపెట్టిన రోజు కాళేశ్వరంలో భారీ అవినీతి జరిగిందని ఆరోపించారు. ఆ సమయంలో రేవంత్ రెడ్డి అదే విషయాన్ని పదేపదే ప్రస్తావించారు. ఆ తర్వాత అన్నారం బ్యారేజ్ లో డ్యామేజ్ జరిగింది. కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోనికి అన్ని బ్యారేజ్ లది ఇదే పరిస్థితి అని నాడు కాంగ్రెస్ నేతలు మొత్తుకున్నారు. ఎన్నికల సమయంలో మేడిగడ్డ అంశంపై హాట్ టాపిక్ గా ఉంది. బీఆర్ఎస్ ప్రభుత్వం అవినీతికి పాల్పడటం వల్లే ప్రాజెక్టులకు ఈ పరిస్థితి దాపురించిందని రేవంత్ రెడ్డి అనేకసార్లు విమర్శించారు. అప్పటి సీఎం కేసీఆర్ సరైన శ్రద్ధ పెట్టకపోవడం వల్లే ప్రాజెక్టు నిర్మాణంలో లోపాలు జరిగాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే ప్రాజెక్టుల్లో జరిగిన అవినీతిపై విచారణ చేయిస్తామని హెచ్చరించారు. తొలుత సైలెంట్ గా ఉన్న బీఆర్ఎస్ నేతలు ఆ తర్వాత మేడిగడ్డపై స్పందించారు. బ్యారేజ్ కు డ్యామేజ్ జరగలేదని అప్పటి మంత్రి హరీశ్ రావు సన్నాయి నొక్కులు నొక్కారు. రెండు పిల్లర్ల మధ్య ఉండే గ్యాప్ ను చూసి పగుళ్లు అని ప్రచారం చేస్తున్నారని కాంగ్రెస్ నేతలపై ఎదురుదాడికి దిగారు. సోషల్ మీడియాలో ఫేక్ ఫోటోలు పెట్టి కాంగ్రెస్ నేతలను హేళన చేసే ప్రయత్నం చేశారు.

# రైతన్నలను ఇబ్బంది పెట్టాలని చూస్తే

## కేంద్రానికి టికాయత్ హెచ్చరిక

మొదటిపేజీ తరువాయి...

ఒక్కో సంఘానిది ఒక్కో సమస్య. ఆ సమస్యల పరిష్కారం నిమిత్తం దిల్లీ బయలుదేరిన రైతులకు ఇబ్బందులు సృష్టించొద్దు. మేం వారికి దూరంగా లేము. అవసరమైతే వారికి మద్దతు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాం' అని టికాయత్ మీడియాతో మాట్లాడారు. గతంలో కేంద్రప్రభుత్వం తీసుకువచ్చిన మూడు సాగు చట్టాలను వ్యతిరేకిస్తూ 2020-21లో అన్నదాతలు చేపట్టిన నిరసనలో రాకేశ్ కీలకపాత్ర పోషించారు. పంటలకు కనీస మద్దతు ధరపై చట్టం రూపకల్పన, 2020 ఆందోళనల్లో పెట్టిన కేసుల కొట్టివేత వంటి డిమాండ్లతో తాజాగా 'దిల్లీ చలో' పేరిట భారీ మార్చ్ తలపెట్టిన రైతులకు తన మద్దతు ఉంటుందని చెప్పారు. అయితే పంజాబ్, హరియాణాల మధ్య ఉన్న శంభు సరిహద్దు( వద్ద నిరసనకారుల్ని చెదరగొట్టేందుకు పోలీసులు బాష్పవాయువును ప్రయోగించారు. ఆ ఉద్రిక్తతల నేపథ్యంలోనే టికాయత్ వార్నింగ్ వచ్చింది. ఇదిలాఉండగా.. రైతుల సమస్యల పరిష్కారం కోసం వారితో ప్రభుత్వం చర్చలు జరపాలని బీకేయూ జాతీయ అధ్యక్షుడు నరేశ్ టికాయత్ కోరారు. భారతీయ కిసాన్ యూనియన్.. ఉత్తర్‌ప్రదేశ్ కేంద్రంగా నడుస్తోన్న రైతుసంఘం. దీని వ్యవస్థాపకుల్లో మాజీ ప్రధాని చౌధరి చరణ్ సింగ్ కూడా ఒకరు. ఆయనకు ఇటీవల కేంద్రం ప్రభుత్వం 'భారతరత్న' పురస్కారాన్ని ప్రకటించిన విషయం తెలిసిందే.

# కాళేశ్వరం అంటే ఒక్క మేడిగడ్డ బ్యారేజే కాదు

మొదటిపేజీ తరువాయి...

అయినా కాళేశ్వరం అంటే ఒక్క మేడిగడ్డనే కాదని.. అది 3 బ్యారేజీలు, 15 రిజర్వాయర్లు, 19 సబ్ స్టేషన్లు, 21 పంప్ హౌస్‌లు, 203 కిలోమీటర్ల సొరంగాలు, 1,531 కిలోమీటర్ల గ్రావిటి కెనాల్, 98 కిలోమీటర్ల ప్రెజర్ మెయిన్స్, 141 టిఎంసీల స్టోరేజ్ కెపాసిటీ, 530 మీటర్ల ఎత్తుకు లిఫ్ట్, 240 టీఎంసీల ఉపయోగం కలగలిసిన సమూహమే కాళేశ్వరం ప్రాజెక్టు అని చెప్పారు. ఒక్క బ్యారేజీలో ఒకటి రెండు కుంగిపోతే కోడిగుడ్డు మీద ఈకలు పీకుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. మేడిగడ్డ సందర్శనలో భాగంగా మీరు వెళ్లే దారిలో రంగనాయక సాగర్, మల్లన్నసాగర్, కుడెల్లి వాగు, పచ్చటి పొలాలు చూడాలన్నారు. కాళేశ్వరం ఫలితాలను గురించి రైతులను అడగాలని సూచించారు. కర్ణాటక కాంగ్రెస్ ఎమ్మెల్యేలు రంగనాయకసాగర్‌ను చూసి అద్భుతమని మెచ్చుకున్నారని గుర్తుచేశారు. ప్రాజెక్టును సరిదిద్దే ప్రయత్నం చేయాలని సూచించారు. విచారణ చేసి సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకోవాలన్నారు. చాప్రాల్ వైల్డ్ లైఫ్ ప్రాంతంలో ప్రాణహిత కట్టాలని చూస్తే అనేక అడ్డంకులు వస్తాయని చెప్పారు. నాడు కేంద్రం, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలో ఉన్న కాంగ్రెస్.. ప్రాణహిత చేవెళ్లను ఎందుకు కట్టలేదని ప్రశ్నించారు. తాము నీళ్ల లేని ప్రాంతం నుంచి ప్రాజెక్టును తరలించి పంటలకు నీళ్లు అందించామన్నారు. మూడు కోట్ల మెట్రిక్ టన్నుల పంట పండిందంటే ఆ జలాల వల్లే జరిగిందని స్పష్టం చేశారు. కాంగ్రెస్ హయాంలో పంజాగుట్ట ఫ్లై ఓవర్ కూలి 20 మంది చనిపోయారని, దేవాదుల పైపులు పేలి నీళ్లు అకాశమంత ఎగిరాయన్నారు. అలాంటి ఘటనలు జరగడం బాధాకరమని చెప్పారు. కానీ తాము ముందుకు వెళ్లాం కదా అని తెలిపారు. ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పగించొద్దని తాము నిద్ర లేపితే లేచారని, ఈ రోజు బీఆర్ఎస్ సభ ఉందని మీరు డైవర్ట్ చేయడం కోసం పోటీ కార్యక్రమం పెట్టారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ నీతిని ప్రజలందరూ గమనిస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ సభలో వెల్లడించిన ప్రతి అంశాన్ని తూర్పారబట్టారు. ఆధారాలతోసహా కాంగ్రెస్ వాదన అబద్ధమని నిరూపించారు. దీంతో ఏం చేయాలో తెలియక కాంగ్రెస్ మంత్రులు, నేతలు హరీశ్‌రావుపై ముప్పేటదాడికి దిగారు. ఒకరి తర్వాత ఒకరు లేస్తూ హరీశ్‌రావును అడ్డుకొనేందుకు తీవ్రంగా యత్నించారు. అంశాన్ని పక్కదోవ పట్టించేందుకు రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. హరీశ్‌రావు మాట్లాడుతుండగానే మంత్రి ఉత్తమ్‌కుమార్ పదే పదే లేస్తూ అడ్డుతగిలారు. అనంతరం కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మల్లు భట్టి విక్రమార్క, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు పదే పదే లేస్తూ చర్చకు ఆటంకం కలిగించారు. మంత్రులే కాదు ఎమ్మెల్యేలు రాజగోపాల్‌రెడ్డి, ఆది శ్రీనివాస్ తదితరులు సైతం తమ స్థానాల నుంచి లేచి హరీశ్‌రావు ప్రసంగానికి అడ్డుతగిలే యత్నం చేశారు. కాంగ్రెస్ మంత్రులు లేవడం.. హరీశ్‌రావు మైక్‌ను స్పీకర్ కట్ చేయడం సభలో చర్చ సందర్భంగా పరిపాటిగా మారిపోయింది.

# పాల్వంచ ఎక్సైజ్ సీఐ బదిలీ

కొత్తగూడెం యదార్థవాది ప్రతినిధి, ఫిబ్రవరి 13: లోక్‌సభ ఎన్నికల నేపథ్యం లో తెలంగాణ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖలో భారీగా బదిలీలు జరిగాయి. ఈ మేరకు స్పెషల్ చీఫ్ సెక్రటరీ సునీల్ శర్మ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో పాల్వంచ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సర్కిల్ ఇన్స్పెక్టర్ గా పనిచేస్తున్న గురునాథ్ రాథోడ్ ను సుల్తానాబాద్ కు బదిలీ చేసారు. మధిర స్టేషన్ హౌస్ ఆఫీసర్ గా విధులు నిర్వహిస్తున్న ఎం. ప్రసాద్ ను పాల్వంచకు బదిలీ చేసారని భద్రాద్రి జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు.

# పాకిస్తాన్ లో నవాజ్-బిలావల్ మధ్య అధికారం పంపకం!

మొదటిపేజీ తరువాయి...

ఇస్లామాబాద్, : పాకిస్థాన్‌లో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడటం దాదాపు ఖాయమైంది. సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న ప్రధాన పార్టీలైన మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్‌కు చెందిన పీఎంఎల్(ఎన్), బిలావల్ బుట్టోకు చెందిన పీపీపీ పార్టీలు ప్రధాని పదవిని పంచుకోనున్నట్లు తెలుస్తోంది. మేరకు రెండు పార్టీల మధ్య ఇప్పటికే ఒప్పందం జరిగినట్లు సమాచారం. రెండు రోజుల క్రితం ఈ విషయంపైనే ఇరు పార్టీల మధ్య ప్రధానంగా చర్చ జరిగింది. మొత్తం ఐదేళ్లలో ఒక పార్టీ మూడేళ్లు, మరో పార్టీ రెండేళ్లు ప్రధాని పదవి పంచుకునేందుకు అంగీకరించినట్లు సమాచారం. టీవల జరిగిన పాకిస్థాన్ ఎన్నికల్లో ప్రభుత్వ ఏర్పాటుకు కావాల్సిన సాధారణ మెజారిటీ ఏ పార్టీకి రాలేదు. దీంతో అత్యధిక సీట్లు సాధించిన ఇమ్రాన్‌ఖాన్‌కు చెందిన తెహ్రీక్ ఈ పాకిస్థాన్ పార్టీని అధికారం నుంచి దూరం చేయడానికి మిగిలిన ప్రధాన పార్టీలన్నీ ఏకమై సంకీర్ణం ఏర్పాటుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నాయి.

# అఫ్లాన్ మోడీకి 65 వేల రిజిస్ట్రేషన్లు

మొదటిపేజీ తరువాయి...

ఇది ఒక ప్రత్యేకమైన కార్యక్రమమని, ప్రవాస భారతీయుల కమ్యూనిటీ దీనికి సకల ఏర్పాట్లు చేస్తున్నదని అన్నారు. కార్యక్రమంలో పాల్గొనేందుకు 65 వేల మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, అంతకుమించి జనం వస్తే, వసతి కల్పించలేమని, అందుకే రిజిస్ట్రేషన్లు ఇక నిలిపివేయాల్సి వచ్చిందని యూఏఈలోని భారత రాయబారి సంజయ్ సుధీర్ తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ నెల 13నుంచి ప్రారంభమయ్యే తన పర్యటనలో యూఏఈ, ఖతార్‌లోని ప్రవాస భారతీయులతో భేటీ కానున్నారు. యూఏఈలో నిర్మితమైన హిందూ దేవాలయాన్ని 14న ప్రధాని ప్రారంభించనున్నారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఐదు వేల మంది భక్తులు హాజరుకానున్నరని అంచనా. 2015 తర్వాత ప్రధాని మోదీ యూఏఈలో పర్యటించడం ఇది ఏడోసారి.

# మంత్రి పదవికి సెంథిల్ బాలాజీ రాజీనామా..

మొదటిపేజీ తరువాయి...

కాగా, న్యాయపరమైన చిక్కుల వల్లే బాలాజీ తన మంత్రి పదవికి రాజీనామా చేయాల్సి వచ్చినట్లు తెలుస్తున్నది. గత ఏడాది జూన్ 14న మనీలాండరింగ్ కేసులో బాలాజీని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అరెస్టు చేసింది. గత అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలో బాలాజీపై చెన్నై క్రైమ్ బ్రాంచ్ పోలీసులు డబ్బుకు ఉద్యోగా కుంభకోణం కేసు నమోదు చేశారు. ఈ కేసులో పెద్దఎత్తున డబ్బు చేతులు మారిందన్న ఆరోపణలపై ఈడీ బాలాజీని అరెస్టు చేసింది. జైలులో ఉన్నప్పటికీ బాలాజీని సీఎం స్టాలిన్ తన మంత్రివర్గంలోనే కొనసాగించారు. అయితే ఏ శాఖను కేటాయించలేదు. అయితే దీనిపై హైకోర్టు ఇటీవల అసంతృప్తి వ్యక్తంచేసింది. బాలాజీని మంత్రి పదవిలో కొనసాగించే విషయమై మరోసారి ఆలోచించాలని సీఎం స్టాలిన్‌కు కోర్టు సూచించింది. దీంతో బెయిల్ పిటిషన్ రెండోసారి హైకోర్టు ముందు విచారణకు రానున్న నేపథ్యంలో బాలాజీ మంత్రి పదవికి రాజీనామా చేశారు.

హైదరాబాద్ యదార్థవాది ప్రతినిధి, ఫిబ్రవరి 13: ఆసియా ఖండంలోనే అతిపెద్ద గిరిజన జాతర మేడారం సమ్మక్క-సారలమ్మ మహాజాతర. నాలుగు రోజుల పాటు సాగనున్న ఈ జాతరకు దేశ, విదేశాల నుంచి దాదాపు కోటి మంది వరకు భక్తుల వరకు వస్తారని అంచనా. ములుగు జిల్లాలోని అటవీ ప్రాంతంలో జరిగే ఈ జాతరలో కమ్యూనికేషన్ సేవలు ఎంతో ముఖ్యం కానున్నాయి. సెల్ ఫోన్ సిగ్నల్స్ నుంచి ఇంటర్నెట్, వైఫై సేవలు చాలా కీలకం కాగా.. సరైన సిగ్నలింగ్ వ్యవస్థ లేక అక్కడికి వెళ్లే భక్తులకు తరచూ ఇబ్బందులు తలెత్తుతుంటాయి. దీంతో ప్రభుత్వరంగ సంస్థ అయిన భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (బీఎస్ఎన్ఎల్) మేడారం మహాజాతరలో మెరుగైన సేవలందించేందుకు సిద్ధమైంది. జాతరలో సిగ్నలింగ్ వ్యవస్థను పటిష్టం చేయడంతో పాటు భక్తులకు ఉచిత వైఫై సేవలందించేందుకు కసరత్తు చేస్తోంది. భక్తుల రద్దీ ఎక్కువగా ఉండే 16 ప్రధాన ప్రాంతాల్లో అక్కడి జనాలంతా ఉచితంగా వైఫై సేవలు వినియోగించుకునేలా ఏర్పాట్లు చేస్తోంది. ఈ మేరకు మేడారం మహాజాతరలో ఇప్పటికే యాక్షన్ స్టార్ట్ చేసింది. మేడారం

మేడారం వరకు సెల్ ఫోన్, ఇంటర్నెట్ కనెక్టివిటీకి ఎలాంటి ఇబ్బందులు, అవరోధాలు తలెత్తకుండా మరో తొమ్మిది చోట్లా తాత్కాలిక టవర్లను ఏర్పాటు చేసేందుకు కసరత్తు చేస్తోంది. వరంగల్ నుంచి మేడారం వరకు సిగ్నల్స్ అంతరాయం కలగకుండా గట్టమ్మ అలయం నుంచి మేడారం వరకు వీటిని అమర్చే ప్రయత్నాల్లో ఉంది. ఇందులో ములుగు సమీపంలోని గట్టమ్మ అలయం, ఊరట్టం క్రాస్ రోడ్డు, కొత్తూరు, రెడ్డిగూడెం, జంపన్నవాగు, కాజ్ వే, మేడారం సమ్మక్క గద్దెలు, ఆర్టీసీ బస్టాండ్, గెస్ట్ హౌజ్ వద్ద ఈ తాత్కాలిక టవర్లను ఏర్పాటు చేస్తోంది. ఈ మేరకు దానిని సంబంధించిన పనులు పూర్తయినట్లుగా బీఎస్ఎన్ఎల్ అధికారులు చెబుతున్నారు. ఈ టవర్ల ద్వారా 2జీ, 3జీ సేవలు నిరంతరాయంగా అందించనున్నట్లు పేర్కొంటున్నారు. భక్తులకు ఇంటర్నెట్ సేవలను అరచేతిలోకి తెచ్చేందుకు బీఎస్ఎన్ఎల్ మేడారం మహాజాతరలో 16 చోట్లా హాట్ స్పాట్ సేవలను అందుబాటులోకి తెచ్చే పనులు చేపడుతున్నారు. ఈ మేరకు ములుగు ఎంట్రన్స్ లోని గట్టమ్మ గుడి, కొత్తూరు రోడ్, కొత్తూరు స్కూల్, ఊరట్టం క్రాస్ రోడ్డు, కాజ్‌వే, రెడ్డిగూడెం స్కూల్, హరిత హోటల్, నార్లాపూర్, ఇంగ్లిష్ మీడియం

సమయంలో ప్రభుత్వం ఈ ఉచిత వైఫై సేవల కోసం సుమారు రూ.20 లక్షల వరకు కేటాయించగా.. ఈసారి కూడా అంతే నిధులతో సేవలందించేందుకు ఏర్పాటు చేసినట్లు అధికారులు చెబుతున్నారు. మహాజాతర మేడారంలో ఈ నెల 15వ తేదీ నుంచి బీఎస్ఎన్ఎల్ వైఫై సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఫిబ్రవరి 21 నుంచి 24వ తేదీ వరకు జాతర జరగనుండగా.. జాతర పూర్తిగా ముగిసే 25వ తేదీ వరకు వైఫై సేవలు అందుబాటులో ఉండనున్నాయి. బీఎస్ఎన్ఎల్ కు సంబంధించిన అన్ని రకాల సేవలను పర్యవేక్షించేందుకు మూడు టీములను కూడా ఏర్పాటు చేశారు. ఆయా బృందాల్లో 20 మంది అధికారులు, సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉంటూ కనెక్టివిటీ, సిగ్నలింగ్ వ్యవస్థలో లోపాలు తలెత్తకుండా పర్యవేక్షించనున్నారు. మేడారం జాతరలో ఫ్రీగా బీఎస్ఎన్ఎల్ సిమ్ములు కూడా అందజేయనున్నారు. వాటిని రూ.249 ప్లాన్ తో రీఛార్జ్ చేసుకుంటే 45 రోజుల పాటు ప్రతి రోజు 2 జీబీ డేటా, 100 ఎస్ఎంఎస్లు, అన్ లిమిటెడ్ ఔట్ గోయింగ్, ఇన్ కమింగ్ కాల్స్ సేవలు పొందవచ్చని అధికారులు చెబుతున్నారు.

ఊరేగించడం, హవేరి గ్యాంగ్ రేప్, సైబర్ క్రైమ్, టెర్రర్ సంబంధిత కార్యకలాపాల కారణంగా రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని ప్రతిపక్ష నేత ఆర్.అశోక్ అన్నారు. దీనిపై చర్చ జరగాలి. ఈ విషయం గత సెషన్‌లో జాబితా చేయబడింది, కానీ చర్చించలేకపోయిందని మండిపడ్డారు. అసెంబ్లీలో జరిగిన గందరగోళాన్ని చూసిన రాష్ట్ర హోంమంత్రి జి పరమేశ్వర మాట్లాడుతూ.. ఈ అంశాన్ని ప్రతిపక్షాలు లేవనెత్తడానికి ప్రభుత్వం వ్యతిరేకం కాదని, ప్రశ్నోత్తరాల సమయం తర్వాత లేవనెత్తాలని అన్నారు. శాంతిభద్రతలు క్షీణిస్తున్నాయనే ఆరోపణలపై ప్రభుత్వం స్పందిస్తుందని, అలాగే బీజేపీ హయాంలో జరిగిన హత్యలు, సంఘ వ్యతిరేక వ్యక్తులు బహిరంగంగా ఆయుధాలను ఎలా ఉపయోగించారో కూడా తెలుసని ఆయన పేర్కొన్నారు. ఆర్.అశోక్‌కు మద్దతుగా బీజేపీ ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడుతూ.. హవేరీ గ్యాంగ్ రేప్ కేసులో సంబంధం లేని వ్యక్తులపై కేసు నమోదైనందున ఈ కేసు చాలా ముఖ్యమైనదని అన్నారు. మాండ్యాలో హనుమాన్ జెండా ఎగురవేసే విషయంలో సరిగ్గా అదే జరిగిందని.. ఇదంతా చూస్తుంటే రాష్ట్రంలో అరాచక వాతావరణం కనిపిస్తోందని బీజేపీ నేత అన్నారు.

# అక్రమంగా నిలువ ఉంచిన బొగ్గు స్వాధీనం

మంథని యదార్థవాది ప్రతినిధి, ఫిబ్రవరి 13: పెద్దపల్లి జిల్లా మంథని మండలం కన్నాల గ్రామంలో సుమారు 200ల క్వింటాళ్ల నిల్వ ఉన్న బొగ్గు ను విజిలెన్స్, ఎస్ అండ్ పిసి అధికారులు స్వాధీనం చేసుకున్నారు. కన్నాల గ్రామంలోని ఇటుకల బట్టి వద్ద మంగళవారం ఉదయం అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేసారు. కొన్ని బొగ్గు నిలువలతోపాటు, బొగ్గును అన్లోడ్ చేయడానికి వచ్చిన రెండు లారీలను సీజ్ చేశారు. ప్రతిరోజు భూపాలపల్లి బొగ్గు గని ఓసి 3 నుండి గోదావరిఖని ఓసి 1 కు బొగ్గును సరఫరా చేస్తారు. ఈ క్రమంలో లారీలలోని బొగ్గును పూర్తిగా డంపు చేయకుండా తిరిగి వెళ్లే క్రమంలో కన్నాల గ్రామంలోని ఇటుకల బట్టి వద్దకు వచ్చి డంపు చేస్తున్నారు. అనుమానం వచ్చిన అధికారులు గత 5 రోజులుగా రెక్కీ నిర్వహించారు. ఈరోజు ఉదయం అధికారులు బొగ్గు నిల్వలను, లారీలను పట్టుకొని సీజ్ చేశారు. ఇటుకల బట్టి యజమాని లారీలలో నుండి రోజున సరాసరి 25 నుంచి 30 టన్నుల బొగ్గును అక్రమంగా దించుకుంటూ, తన ఇటుకల బట్టికి వాడుతున్నారని నిర్ధారించారు. అదేవిధంగా నాణ్యమైన బొగ్గును లారీలలో నింపి ఇతర ప్రాంతాలకు అధిక ధరకు అమ్ముకుంటున్నట్లు సమాచారం.

# గ్రేటర్ హైదరాబాద్ లో కుదుపులు

హైదరాబాద్ యదార్థవాది ప్రతినిధి, ఫిబ్రవరి 13: మొన్నటి ఎన్నికల్లో రాష్ట్రం మొత్తం కాంగ్రెస్ హవా కొనసాగితే.. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో మాత్రం కారు దూకుడు చూపింది. నల్లగొండ, ఖమ్మం, వరంగల్, మహబూబ్ నగర్ వంటి జిల్లాలు కాంగ్రెస్ పార్టీకి స్నేహ హస్తం అందించినప్పటికీ.. హైదరాబాద్ గ్రేటర్ పరిధిలో ప్రజలు చేతికి హ్యాండ్ ఇచ్చి.. కారుకు జై కొట్టారు. రాజేంద్రనగర్ నుంచి కూకట్పల్లి దాకా గులాబీ పార్టీ అభ్యర్థులే ఎమ్మెల్యేలుగా గెలిచారు. గ్రేటర్ పరిధిలో తాము చేసిన అభివృద్ధి వల్లే ప్రజలు గెలిపించాలని అప్పట్లో కేటీఆర్ వ్యాఖ్యానిం చారు. పార్లమెంట్ ఎన్నికల్లో కూడా ఈ సత్తా చూపిస్తామని ప్రకటించారు.

అయితే ప్రస్తుత పరిస్థితులను చూస్తే గ్రేటర్ పరిధిలో కారు ఖాళీ అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. అసెంబ్లీ ఎన్నికల నాటి దూకుడు ఇప్పుడు సన్నగిల్లే పరిస్థితులు ఉన్నాయని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. ఇటీవల గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ గద్వాల విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కొద్ది రోజుల తేడాతోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిశారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కు నిధులు మంజూరు చేసేందుకే తాము ముఖ్యమంత్రిని కలిశామని వారు ప్రకటించారు. కానీ అంతకుముందు మెదక్ జిల్లా పరిధిలోని నలుగురు ఎమ్మెల్యేలు కూడా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిశారు.

అయితే వారంతా కూడా కాంగ్రెస్ పార్టీలో చేరుతారని ఊహాగానాలు వినిపించాయి. ఆ ఎమ్మెల్యేలు కూడా ఆ వ్యాఖ్యలను కొట్టిపారేశారు. కొద్దిరోజుల తర్వాత గ్రేటర్ పరిధిలో మేయర్, డిప్యూటీ మేయర్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కలిశారు. అంతకుముందు గ్రేటర్ పరిధిలోని కార్పొరే టర్లతో భారత రాష్ట్ర సమితి కార్య నిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి డిప్యూటీ మేయర్, కొంతమంది కార్పొరేటర్లు గైరాజులయ్యారు. వ్యక్తిగత కారణాలతోనే తాము గైర్హాజరయ్యామని వారు చెప్పినప్పటికీ అసలు వాస్తవం అది కాదని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. వారి గైర్హాజరు తో భారత రాష్ట్ర సమితిలో కలకలం చెలరేగింది. తమకు ఇతర పనులు ఉండటం వల్ల ఆ సమావేశానికి రాలేదని వారు చెప్పినప్పటికీ ఎవరూ నమ్మడం లేదు. ఇక ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో భారత రాష్ట్ర సమితి చెందిన నేతలు ఎవరైనా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిస్తే.. వారు పార్టీ మారుతున్నారనే ప్రచారం జరుగుతున్నది. రాష్ట్రంలో పలు మునిసిపాలిటీలలో అవిశ్వాస తీర్మానాలు జోరుగా సాగుతున్నాయి. దీంతో ఇప్పటివరకు కొనసాగిన భారత రాష్ట్ర సమితి చైర్మన్లు మాజీలు అయిపోతున్నారు. దాదాపు 20 మున్సిపాలిటీలో భారత రాష్ట్ర సమితి కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీలో చేరిపోయి అవిశ్వాస తీర్మానాలకు మద్దతు ఇచ్చి చైర్మన్లను దింపేశారు.

దీంతో ఒక్కసారిగా కాంగ్రెస్ పార్టీ ఖాతాలో 20 మున్సిపాలిటీలు చేరాయి. ఇన్ని మున్సిపాలిటీలు తన ఖాతాలో పడ్డప్పుడు కాంగ్రెస్ పార్టీ మాత్రం హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ను ఎందుకు వద్దనుకుంటుంది? ఈ క్రమంలోనే మేయర్ గద్వాల విజయలక్ష్మి రేవంత్ రెడ్డిని కలిశారని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. అంతేకాదు గతంలో డిప్యూటీ మేయర్ గా పని చేసిన బాబా ఫసియుద్దీన్ కాంగ్రెస్ పార్టీలో చేరారు.. ఈయన ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో గ్రేటర్ పరిధిలో విస్తృతంగా పనిచేశారు. భారత రాష్ట్ర సమితి అంతమంది ఎమ్మెల్యేలను గెలుచుకోవడంలో కీలక పాత్ర పోషించారు. త్వరలో పార్లమెంటు ఎన్నికల్లో నేపథ్యంలో ఫసియుద్దీన్ కాంగ్రెస్ పార్టీలో చేరడం భారత రాష్ట్ర సమితికి పెద్ద దెబ్బ అని రాజకీయ విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు. ఇక ప్రస్తుతం అందుతున్న వివరాల ప్రకారం భారత రాష్ట్ర సమితికి చెందిన 56 మంది కార్పొరేటర్లలో 26 మంది కాంగ్రెస్ పార్టీలోకి వచ్చేందుకు రెడీగా ఉన్నారని తెలుస్తోంది. ఎంఐఎం కూడా కాంగ్రెస్ పాట పాడుతున్న నేపథ్యంలో.. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కూడా చేతిలోకి వెళ్లే అవకాశం కల్పిస్తోంది.

మరోవైపు తాము రేవంత్ రెడ్డిని కలిసింది నియోజకవర్గ అభివృద్ధి కోసం మాత్రమే అని మేయర్, డిప్యూటీ మేయర్ చెబుతున్నప్పటికీ అసలు విషయం అది కాదని.. దాని వెనుక పెద్ద కథ ఉందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. మొన్నటిదాకా కేటీఆర్ మాటే శిరోధార్యం అని భావించిన భారత రాష్ట్ర సమితిలో.. అనూహ్యంగా చోటు చేసుకున్న పరిణామాలు కారును ఇబ్బంది పెడుతున్నాయి. మరీ ముఖ్యంగా పార్లమెంట్ ఎన్నికల ముంగిట కలవరపాటుకు గురిచేస్తున్నాయి. మరి వీటిని భారత రాష్ట్ర సమితి ఎలా ఎదుర్కొంటుందని ఇప్పుడు అసలు ప్రశ్న.

# రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి

**సిద్దిపేట ట్రాఫిక్ సీఐ రామకృష్ణ, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ లక్ష్మణ్, కవితలు అవగాహన**



కొండపాక యదార్థవాది ప్రతినిధి, ఫిబ్రవరి 13: మండలంలోని దుద్దెడ టోల్ గేట్ వద్ద వాహనదారులకు, ప్రజలకు, ప్రయాణికులకు, రోడ్డు భద్రత మాసోత్సవాలు సందర్భంగా మైనర్ డ్రైవింగ్, ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు నిబంధనల గురించి సిద్దిపేట ట్రాఫిక్ సీఐ రామకృష్ణ, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ లక్ష్మణ్, కవితలు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...రోడ్డు నిబంధనలు ట్రాఫిక్ నిబంధనలు పాటించి, వాహనాలు నడిపి క్షేమంగా గమ్యస్థానాలకు చేరుకోవాలన్నారు. రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా రోడ్డు నిబంధనలు ట్రాఫిక్ నిబంధనలు హెల్మెట్ సీట్ బెల్ట్ తదితర అంశాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. మద్యం సేవించి వాహనాలు నడపవద్దని సూచించారు. మోటార్ సైకిల్ వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని ప్రమాదాల నివారణకు కృషి చేయాలని తెలిపారు. రోడ్లకు ఇరువైపులా ఏర్పాటుచేసిన సైనింగ్ బోర్డ్స్ సూచనలు సలహాలు పాటిస్తూ సేఫ్టీగా డ్రైవింగ్ చేసి క్షేమంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని సూచించారు.

కారు నడిపేటప్పుడు సీట్ బెల్ట్ ధరించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణ గురించి ప్రతి సంవత్సరం భద్రత వారోత్సవాలు ద్వారా ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. వాహనదారులు ప్రజలలో మార్పు వచ్చినప్పుడు మాత్రమే రోడ్డు ప్రమాదాలు తగ్గుతాయని తెలిపారు. రోజురోజుకు వాహనాల రద్దీ పెరుగుతుందని దాన్ని దృష్టిలో ఉంచుకొని సేఫ్టీ సెక్యూరిటీగా డ్రైవింగ్ చేయాలని సూచించారు. రాంగ్ రూట్లో ఎట్టి పరిస్థితుల్లో వాహనం నడపవద్దని తెలిపారు. పార్కింగ్ ప్రదేశాలలో వాహనాలు పార్క్ చేసుకోవాలని రోడ్డుకు అడ్డదిడ్డంగా వాహనాల పేర్లు చేయవద్దని తెలిపారు. జరిమానా ఫైన్ లు వేయడం మా అభిమతం కాదని ప్రమాదాల నివారణ గురించి రోడ్డు నిబంధనలు ట్రాఫిక్ నిబంధనలు పాటించని వారిపై మాత్రవే జరిమానాలు విధించడం జరుగుతుందని తెలిపారు. ప్రతి వాహనదారుడు రోడ్డు నిబంధనలు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. నిబంధనలు పాటించి వాహనాలు నడిపిన వాహనదారులను అభినందించి గులాబీ పువ్వులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సిబ్బంది, ఆర్టీవో కార్యాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అరకు లోయలో హాస్టల్‌లో విద్యార్థిని ఆత్మహత్య

అమరావతి యదార్థవాది ప్రతినిధి, ఫిబ్రవరి 13:తెలుగు రాష్ట్రాల్లో విద్యార్థినుల ఆత్మహత్యలు కలకలం రేపుతున్నాయి. ఇటీవలే తెలంగాణలోని భువనగిరి సాంఘీక వసతి గృహంలో ఇద్దరు విద్యార్థినుల ఆత్మహత్య ఘటన మరువక ముందే ఆంధ్రప్రదేశ్ లో మరో ఘటన చోటు చేసుకుంది. తాజాగా.. అల్లూరి జిల్లా అరకు లోయలో హాస్టల్ విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. తొమ్మిదో తరగతి చదువుతున్న కిల్లో వసంత అనే విద్యార్థిని ఏమైందో ఏమో తెలియదు కానీ.. ఈ మధ్యాహ్నం ఆత్మహత్య చేసుకుంది. డుంబ్రిగూడ మండలం ఓంబి గ్రామానికి చెందిన వసంత ఇంటికి వెళ్లి ఈ మధ్యాహ్నమే తిరిగి హాస్టల్ కు వచ్చింది. తన తండ్రి ఓ హత్య కేసులో ఇటీవలె జైలు నుండి విడుదలై వచ్చాడు. ఈ క్రమంలో తండ్రిని చూసేందుకు వెళ్లి మళ్లీ తిరిగి హాస్టల్ కు వచ్చింది. అయితే ఇంటికి వెళ్లి వచ్చాక ఆత్మహత్య చేసుకోవడంపై పలు అనుమానాలు రేపుతున్నాయి. ఇంటి దగ్గర ఏమైనా గొడవలయ్యాయా.. లేదంటే హాస్టల్ లో ఎవరైనా మందలించారా అనే విషయాలు తెలియాల్సి ఉంది. కాగా.. ఈ ఘటనలో ఆత్మహత్యకు గల కారణాలను పోలీసులు విచారిస్తున్నారు.

# వైరల్ అవుతున్న టీడీపీ జాబితా

విజయవాడ యదార్థవాది ప్రతినిధి, ఫిబ్రవరి 13: ఉమ్మడి కృష్ణా జిల్లాలో టీడీపీ, జనసేన కూటమి అభ్యర్థులు దాదాపు ఖరారు అయ్యారు. 10 స్థానాలకు అభ్యర్థులను టీడీపీ, జనసేన ఫిక్స్ చేశాయి. మచిలీపట్నం నుంచి మాజీ మంత్రి కొల్లు రవీంద్ర, గుడివాడ నుంచి వెనిగండ్ల రాము, గన్నవరం నుంచి యార్లగడ్డ వెంకట్రావు, పామర్రు నియోజకవర్గం నుంచి వర్ల కుమార్ రాజు అభ్యర్థిత్వాలను ఖరారు చేసినట్లు తెలుస్తోంది. ఇక విజయవాడ తూర్పు సెగ్మెంట్ నుంచి ప్రస్తుత సిట్టింగ్ ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, నందిగామ నియోజకవర్గం నుంచి తంగిరాల సౌమ్య, నూజివీడు నుంచి కొలుసు పార్థసారథిలను అభ్యర్థులుగా ఫిక్స్ చేసినట్లు సమాచారం. అటు విజయవాడ పశ్చిమ నియోజకవర్గాన్ని జనసేనకు కేటాయించగా.. సెంట్రల్ నుంచి బొండా ఉమామహేశ్వరరావు మరోసారి బరిలోకి దిగనున్నారు. ఇక జగ్గయ్యపేట నియోజకవర్గం నుంచి శ్రీరామ్ రాజగోపాల్ తాతయ్యకు టికెట్ ఖరారు చేసినట్లు తెలుస్తోంది.ఏపీలో ఎన్నికలకు ఇంకా రెండు నెలలు మాత్రమే సమయం ఉంది. దీంతో పార్టీలన్నీ ఎన్నికలకు సిద్ధమవుతున్నాయి. వచ్చే నెలలో ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే అవకాశముండగా.. ఏప్రిల్‌లో ఎన్నికల పోలింగ్ జరగనుందని తెలుస్తోంది. ఇప్పటికే షెడ్యూల్‌ను కూడా ఈసీ ఫిక్స్ చేసిందని, అన్ని రాష్ట్రాల ఎన్నికల అధికారులకు సమాచారం ఇచ్చినట్లు వార్తలొస్తున్నాయి. ఏప్రిల్ 16న ఏపీ ఎన్నికలు జరుగుతాయనే ఊహాగానాలు కూడా వినిపిస్తున్నాయి. దీంతో పార్టీలన్నీ అప్రమత్తం అయ్యాయి. ఎన్నికల షెడ్యూల్ కంటే ముందుగానే అభ్యర్థులను ఖరారు చేస్తున్నాయి. ఇప్పటికే వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్తలను మార్చుతూ పరోక్షంగా అభ్యర్థులను ప్రకటిస్తోంది. దీంతో టీడీపీ కూడా అభ్యర్థుల ఖరారుపై స్పీడ్ పెంచింది. ఇటీవల ఉండవల్లిలోని చంద్రబాబు నివాసానికి పవన్ వెళ్లారు. ఈ సందర్భంగా సీట్ల సర్దుబాటు, అభ్యర్థులు ఎవరనే దానిపై ఇరువురు చర్చించుకున్నట్లు తెలుస్తోంది. కొన్ని సీట్లలో మినహా దాదాపు మెజార్టీ స్థానాల్లో అభ్యర్థులను టీడీపీ, జనసేన కూటమి ఖరారు చేసింది. ఇటీవల ఉమ్మడి గుంటూరు జిల్లాలో టీడీపీ, జనసేన అభ్యర్థులను ఖరారు చేసింది. మొత్తం 17 స్థానాలు ఉండగా.. 12 స్థానాలకు అభ్యర్థులను ఫిక్స్ చేశారు. తెనాలి సీటును జనసేనకు కేటాయించగా.. అక్కడ నుంచి జనసేన పొలిటికల్ అఫైర్స్ కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ పోటీ చేయనున్నారు. ఇక మంగళగిరి నుంచి నారా లోకేష్, వేమూరు నుంచి నక్కా ఆనందబాబు, పొన్నూరు నుంచి దూళిపాళ్ల నరేంద్ర కుమార్, చిలకలూరిపేట నుంచి పత్తిపాటి పుల్లారావు పేర్లు ఖరారయ్యాయి. అటు పత్తిపాడు నుంచి బూర్ల రామాంజనేయులు, వినుకొండ నుంచి జీవీ ఆంజనేయులు, మాచర్ల నుంచి జులకంటి బ్రహ్మారెడ్డి, గురజాల నుంచి యరపతినేని శ్రీనివాసరావు, బాపట్ల నుంచి వేగేశ్న నరేంద్ర శర్మ అభ్యర్థిత్వాలు ఖరారు అయ్యాయి. సత్తెనపల్లి నుంచి కన్నా లక్ష్మీనారాయణ, రేపల్లె నుంచి అనగాని సత్యప్రసాద్ పేర్లు ఖరారయ్యాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఎంపీ స్థానాలకు కూడా టీడీపీ అభ్యర్థులు ఖరారు అయ్యారు. నర్సరావుపేట ఎంపీ సీటును లావు శ్రీ కృష్ణదేవరాయలు, గుంటూరు నుంచి పేమ్మసాని చంద్రశేఖర్లకు టికెట్ కేటాయించారు. దాదాపు మెజార్టీ స్థానాల్లో అభ్యర్థులు ఎవరనే దానిపై టీడీపీ, జనసేన క్లారిటీకి వచ్చాయి. కానీ అనూహ్యంగా బీజేపీ కూడా పొత్తులో చేరేందుకు రెడీ అయింది. దీంతో 3 ఎంపీ, 8 అసెంబ్లీ స్థానాలను బీజేపీకి ఇవ్వాలని టీడీపీ, జనసేన ఓ అంచనాకు వచ్చాయి. మరో వారం రోజుల్లో బీజేపీతో పొత్తుపై పూర్తి స్పష్టత రానుంది.

## నేత్రదానం మహాదానం

**నేత్రదాత సంస్మరణ సభ నిర్వహించిన సదాశయ ఫౌండేషన్**

కమాన్ పూర్ యదార్థవాది ప్రతినిధి, ఫిబ్రవరి 13: పెద్దపల్లి జిల్లా, మండల కమాన్ పూర్ గ్రామ నివాసి కోటగిరి రాజయ్య((59) జనవరి 31 న పరమపదించగా అయన కుటుంబసభ్యులు నేత్రదానం చేశారు. నేత్రదాత కోటగిరి రాజయ్య సంస్మరణ సభను అయన స్వగృహం లో సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. జ సదాశయ ఫౌండేషన్ జాతీయ కార్యదర్శి లింగమూర్తి, గోదావరిఖని అధ్యక్షురాలు అన్నపూర్ణ , నేత్ర అవయవ దేహదానాలపై అవగాహన కల్పించి నేత్రదాతకు ఘనంగా నివాళులర్పించారు.

లయన్స్ క్లబ్ కమాన్పూర్ సభ్యులు బోనాల వెంకటస్వామి మాజీ ఎంపీపీ ఇనగంటి రామారావు ద్వారా వారికి అభినందన పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు బానయ్య రాజమహేందర్ రెడ్డి, బంధుమిత్రులు పాల్గొన్నారు..

అమె మృతి చెందినట్లు పోలీసులు భావిస్తున్నారు. సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురం కాలనీలో నివాసముండే 26ఏళ్ల డాక్టర్ లక్ష్మీరచనారెడ్డి అనే మహిళ.. బాచుపల్లి మమత వైద్య కళాశాలలో పీజీ గైనకాలజీ ఇంటర్న్‌షిప్ చేస్తోంది. ఆమె తండ్రి మోతె ప్రకాష్‌రెడ్డి వ్యాపారి. రోజూ ఆమె కాలేజీకి కారులో వెళ్లి వచ్చేది. సోమవారం ఉదయం 8 గంటలకు ఇంటి నుంచి బయలుదేరిన రచనా ఔటర్ రింగ్‌రోడ్డుపై కారు పక్కకి నిలిపి.. డ్రైవింగ్ సీట్లోనే ఇంజక్షన్ తీసుకుని అపస్మారక స్థితిలోకి వెళ్లారు. కిష్టారెడ్డిపేట గ్రామ శివారులోని ఔటర్‌రింగ్ రోడ్డుపై కారులో ఓ యువతి అపస్మారక స్థితిలో ఉందని అమీన్‌పూర్ పోలీసులకు సమాచారం అందింది. దీంతో హుటాహుటిన అక్కడికి చేరుకున్న పోలీసులు ప్రాణాపాయ స్థితిలో ఉన్న లక్ష్మీరచనారెడ్డిని అమె చదువుకుంటున్న మమత అస్పత్రికే తరలించారు. అమె ప్రాణాలు కాపాడేందుకు డాక్టర్లు ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. సోమవారం సాయంత్రం 4 గంటల సమయంలో మృతి చెందింది. ప్రాణాంతక ఇంజక్షన్ తీసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో నిర్ధారణ అయింది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని పటాన్‌చెరు ఏరియా ఆసుపత్రికి తరలించి.. ఆత్మహత్యకు గల కారణాలను తెలుసుకునేందుకు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. లక్ష్మీ రచనారెడ్డి ఆత్మహత్య ఘటన.. మమతా అస్పత్రిలో, తోటి విద్యార్థుల్లో విషాదాన్ని నింపింది. ఆమె తల్లిదండ్రులు మాత్రం.. తమకూతురికి ఎలాంటి ఇబ్బందులు లేవంటున్నారు. చదువంటే చాలా ఇష్టమని, డాక్టర్ అవ్వాలన్నది తన గోల్ అని, డాక్టర్ కావడమే జీవిత ఆశయంగా పెట్టుకుందని పేర్కొన్నారు. చదువు ఒత్తిడి తట్టుకోలేక ఈ నిర్ణయం తీసుకుందా ? లేక తనను ఎవరైనా వేధిస్తున్నారా అన్న కోణాల్లోనూ పోలీసులు విచారణ చేస్తున్నారు. రచనారెడ్డి అపస్మారక స్థితిలో ఉన్నపుడు కారులో డ్రైవర్ సీటులో సీటుబెల్ట్ పెట్టుకుని ఉందని, చేతికి కాన్యులా ఉండటంతో పాయిజన్ తీసుకుని ఉంటుందని భావిస్తున్నారు.

చేయదల్చుకోలేదు. ఇక రేపటి నుంచి నా పని మొదలుపెట్టాలి. నాకు షూటింగ్ ఉంది. అందులో పాల్గొనాలి. ఇకపోతే హాస్పిటల్ బెడ్ పై ఉన్నప్పుడు ప్రధాని మోదీ నాకు ఫోన్ చేసి తిట్టారు. ఆరోగ్యం విషయంలో ఇంత నిర్లక్ష్యంగా ఉంటావా అంటూ తిట్టారు" అని చెప్పుకొచ్చాడు. ప్రస్తుతం మిథున్ చక్రవర్తి వ్యాఖ్యలు నెట్టింట వైరల్ గా మారాయి. ఇకపోతే ఈ మధ్యనే ఆయనకు పద్మశ్రీ అవార్డును ప్రకటించింది కేంద్రం. బాలీవుడ్‌లో 80, 90వ దశకాల్లో మిథున్ చక్రవర్తి హవా కొనసాగింది. 'అయాం ఏ డిస్కో డ్యాన్సర్' అంటూ ప్రేక్షకులపై చెరగని ముద్రవేశారు. బెంగాలీ కుటుంబానికి చెందిన మిథున్ చక్రవర్తి బాలీవుడ్, బెంగాలీ సినిమాల్లో హీరోగా చేశారు. 100కి పైగా చిత్రాల్లో నటించిన ఆయన చివరిసారిగా బెంగాలీ చిత్రం 'కాబూలీవాలా'లో నటించారు. 'కశ్మీర్ ఫైల్స్' సినిమాలోనూ నటుడిగా ఆయన తన సత్తా చాటారు. శ్రీదేవి సరసన అనేక చిత్రాల్లో నటించిన ఆయన తెలుగులో 'గోపాల గోపాల' చిత్రంలోనూ నటించారు.

న్నారు.ఇస్లామాబాద్ యునైటెడ్ స్క్వాడ్: జోర్డాన్ కాక్స్, షాదాబ్ ఖాన్, టైమల్ మిల్స్, అజం ఖాన్, ఇమాద్ వసీం, ఫహీమ్ అష్రఫ్, అలెక్స్ హేల్స్, కోలిన్ మన్రో, మాథ్యూ ఫోర్డ్, సల్మాన్ అలీ అఘా, ఖాసిం అక్రమ్, షహబ్ ఖాన్, రుమ్మన్ రయీస్, హునైన్ షా, ఉబైద్ షా, నసీమ్ షా, షామిల్ హుస్సేన్, టామ్ కరణ్. పాకిస్థాన్ సూపర్ లీగ్ 9వ ఎడిషన్ ఫిబ్రవరి 17 నుంచి ప్రారంభం కానుంది. ఈ టోర్నీలో 6 జట్లలో ఇస్లామాబాద్ యునైటెడ్, కరాచీ కింగ్స్, లాహోర్ ఖలందర్స్, ముల్తాన్ సుల్తాన్స్, పెషావర్ జల్మీ, ఖ్వెట్టా గ్లాడియేటర్స్ తలపడనున్నాయి.

## టీమిండియా మాజీ కెప్టెన్ దత్తాజీరావు గైక్వాడ్ కన్నుమూత





భారత క్రికెట్‌లో విషాదం చోటు చేసుకుంది. టీమిండియా మాజీ కెప్టెన్ దత్తాజీరావు గైక్వాడ్ కన్నుమూశారు. ఆయన వయసు 95 ఏళ్లు. వృద్ధాప్య సంబంధిత సమస్యలతో మంగళవారం తెల్లవారుజామున బరోడాలోని తన నివాసంలో ఆయన తుది శ్వాస విడిచారు. గత 12 రోజులుగా ఐసీయులో ఉన్న దత్తాజీరావు ఈ తెల్లవారుజామున మరణించినట్లు కుటుంబ సభ్యులు పీటీఐకి తెలిపారు. భారత మాజీ ఓపెనర్, జాతీయ కోచ్ అంశుమాన్ గైక్వాడ్ తండ్రే దత్తాజీరావు గైక్వాడ్.దత్తాజీరావు గైక్వాడ్ పూర్తి పేరు దత్తాజీరావు కృష్ణారావు. అందరూ ఆయనను దత్తా గైక్వాడ్ అని పిలుస్తారు. 1952-1961 మధ్య భారత్ తరపున 11 టెస్టులు ఆడిన గైక్వాడ్.. 18.42 సగటుతో 350 పరుగులు చేశారు. 1959 ఇంగ్గండ్ పర్యటనలో టీమిండియాకు కెప్టెన్‌గా వ్యవహరించారు. అయితే ఆ సిరీస్‌లో ఐదు మ్యాచ్‌ల్లోనూ భారత్ ఓడిపోయింది. 1952లో లీడ్స్‌లో ఇంగ్లండ్‌పై అరంగేట్రం చేసిన దత్తాజీరావు.. 1961లో చెన్నైలో పాకిస్థాన్‌పై చివరి మ్యాచ్ ఆడారు.ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో 1947 నుంచి 1961 కాలంలో బరోడాకు దత్తాజీరావు గైక్వాడ్ ప్రాతినిథ్యం వహించారు. ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో 47.56 సగటుతో 3139 పరుగులు చేశారు. ఇందులో 14 సెంచరీలు ఉన్నాయి. దత్తాజీరావు మృతిపై బీసీసీఐ సంతాపం ప్రకటించింది. 'భారత మాజీ కెప్టెన్, టీమిండియా అత్యంత వృద్ధ టెస్ట్ క్రికెటర్ దత్తాజీరావు గైక్వాడ్ మరణంపై ప్రగాఢ సంతాపాన్ని ప్రకటిస్తున్నాం. భారత్ తరపున 11 టెస్టులు ఆడారు. 1959లో ఇంగ్లండ్ పర్యటనలో జట్టుకు నాయకత్వం వహించారు. అతని కెప్టెన్సీలో బరోడా 1957-58 సీజన్‌లో రంజీ ట్రోఫీని గెలుచుకుంది. గైక్వాడ్ కుటుంబంకు హృదయపూర్వక సంతాపాన్ని తెలియజేస్తున్నాం' అని బీసీసీఐ ఎక్స్‌లో పేర్కొంది.

# వివాదాలమయం... కాణిపాకం



**తిరుపతి యదార్థవాది ప్రతినిధి, ఫిబ్రవరి 13:** కాణిపాకం దేవస్థానంలో ఉభయ దారులు వర్సెస్ అలయ యంత్రాంగం మధ్య వార్ నడుస్తోంది. అలయ ఈఓ, పాలకమండలి చైర్మన్ తీరుపై మండిపడుతున్న ఉభయదారులు ఆందోళనకు దిగాల్సిన పరిస్థితికి కారణం అయ్యింది. వెయ్యేళ్ల చరిత్ర కలిగిన అలయ ప్రతిష్ట దిగజార్చేలా ఉభయదారుల తీరు ఉందంటున్న చైర్మన్, ఈఓ కౌంటర్ ఎటాక్ తో కాణిపాకం టెంపుల్ వ్యవహారం కాంట్రవర్సీగా మారింది.స్వయంభు శ్రీ వరసిద్ధి వినాయకుడు వెలసిన క్షేత్రం ఇప్పుడు కాంట్రవర్సీ కి కేరాఫ్ గా మారుతోంది. ఈ మధ్య కాలంలో పలు వివాదాలతో తెరమీదికి వచ్చిన దేవస్థానం ఇప్పుడు అలయ ఈఓ చైర్మన్ తీరు ఉభయ దారులను రోడ్డెక్కేలా చేసింది. గత కొద్దికాలంగా అలయ ఈఓ వెంకటేష్ వ్యవహారంపై గుర్రుగా ఉన్నారు ఉభయదారులు. 4 రోజుల క్రితం సీఎం జగన్ చేతుల మీదుగా కాణిపాకం అలయచరిత్ర, వైభవం గ్రంథాన్ని అవిష్కరించిన కాణిపాకం అలయ చైర్మన్, ఈవో ఉభయ దారులుగా ఎలాంటి ప్రాధాన్యత ఇవ్వలేదన్న విషయాన్ని తెరమీదికి తెచ్చారు. సీఎం అవిష్కరించిన కాణిపాకం అలయ చరిత్ర వైభవం పుస్తకంలో ఉభయదారుల ప్రస్థావన లేదని ఆరోపిస్తున్నారు ఉభయదారులు. పుస్తకం అవిష్కరణ కార్యక్రమంలో ప్రాధాన్యత లేక పోవడం, కనీస సమాచారం ఇవ్వకపోవడాన్ని తప్పుపడుతున్నారు.వెయ్యేళ్ల నాటి అలయ అభివృద్ధి, పరిరక్షణకు ఎంతో కృషి చేసిన ఉభయదారులదే కీలకపాత్రని చెబుతున్నారు. ధూప దీప నైవేద్యాలకు నోచుకోని సమయంలో కాణిపాకంకు చుట్టూ పక్కల ఉన్న 14 గ్రామాల ప్రజలు స్వయంభు వరసిద్ధి వినాయకుడి అలయ జీర్ణోద్ధరణకు అండగా ఉన్నామని ఉభయదారులు భావిస్తున్నారు. అలయ అభివృద్ధిలో భాగంగా మాస్టర్ ప్లాన్ కు సహకరించి వందలాది ఎకరాలను ఇచ్చి సహకరించింది ఉభయ దారులేనని, అయితే గత కొంతకాలంగా ఉభయ దారుల ప్రాధాన్యత తగ్గుతోందన్న వాదన బలంగా వినిపిస్తోంది.అలయ ఈవోగా వెంకటేష్, పాలకమండలి చైర్మన్ గా మోహన్ రెడ్డి బాధ్యతలు చేపట్టాక ఉభయ దారులకు కనీస గౌరవం కూడా తగ్గడం లేదని వాపోతున్నారు. దీనికి తోడు ఈ మధ్య కాలంలో కాణిపాకం అలయ పాలనలో అనేక వివాదాలు తెరమీదికి రావడాన్ని కూడా ఉభయదారులు ప్రశ్నిస్తున్నారు. అలయ అభివృద్ధి తీసుకుంటున్న నిర్ణయాలపై ఉభయ దారులకు ఏ మాత్రం సమాచారం ఇవ్వకపోవడం కూడా వివాదానికి కారణం అయ్యింది. ఈ మధ్య కాలంలో దాతలు ఇచ్చిన కానుకలు మాయం కావడం, అర్చకులు అధికారుల ఇష్టారాజ్యంపై ఆరోపణలు రావడం తో చెలరేగిన దుమారాన్ని ఎత్తి చూపుతున్న ఉభయ దారులు అలయంలో సేవల టికెట్ల పెంపులో పాలకమండలి ఏకపక్ష నిర్ణయాలను తప్పుపడుతున్నారు.దీంతో అలయ పాలన తీరును ప్రశ్నిస్తూ రెండ్రోజుల క్రితం ఈఓ కార్యాలయం ముందు ఉభయదారుల నిరసనకు దిగారు. కాణిపాకం మాలయ చరిత్ర వైభవం పుస్తకంలో ఉభయదారులకు చోటు కల్పించకపోవడాన్నే తీవ్రంగా పరిగణిస్తున్న వేదాలను ఈ మేరకు సమావేశమై అలయ యంత్రాంగంపై పోరాటానికి సిద్ధం అయ్యారు. ఈవో వెంకటేష్, చైర్మన్ మోహన్ రెడ్డి తీరుపై ఉభయదారుల అగ్రహం వ్యక్తం చేస్తూ కాణిపాకం అలయ పరిపాలన కార్యాలయం ముందు ధర్నాకు దిగారు. ఈఓ వెంకటేష్ ను సస్పెండ్ చేయడంతో పాటు పాలకమండలి చైర్మన్ మోహన్ రెడ్డి రాజీనామా చేయాలని ప్రధాన డిమాండ్ ను ఉభయదారులు తెర మీదికి తెచ్చారు. ఉభయ దారుల్లో ఒకరైన కాణిపాకం సర్పంచ్ కు కూడా కనీస గౌరవం ఇవ్వడం లేదని ఆరోపిస్తున్నారు.ఇక ఉభయదారుల ఆరోపణలు, వ్యవహారం దేవస్థానం ప్రతిష్ట దిగజార్చేలా ఉందని అలయ యంత్రాంగం ఎదురు దాడి చేస్తోంది. అలయ ప్రతిష్టను దెబ్బతీసేలా ఉభయ దారులు వ్యవహరిస్తున్నారని అలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేష్ ఆరోపిస్తున్నారు. సమస్యలుంటే చెప్పుకోవాలే తప్ప అలయ పాలనను అడ్డుకునే ప్రయత్నం చేస్తే సహించేది లేదని ఈఓ వార్నింగ్ ఇస్తున్నారు. చూడాలి మీర ఈ గొడవ ఎంతవరకు దారి తీస్తుందో..!

## పీడీఎస్యు ఆదిలాబాద్ జిల్లా నూతన కమిటీ ఎన్నిక

ఆదిలాబాద్ యదార్థవాది ప్రతినిధి, ఫిబ్రవరి 13: ఫిబ్రవరి 12, 13తేదీ లలో ఆదిలాబాద్ కేంద్రంలోని యాదవ సంఘ భవనంలో జరిగిన పిడిఎస్యు జిల్లా నిర్మాణ జనరల్ బాడీ జరగింది.ఈ సమావేశానికి జిల్లా నలుమూలల నుండి హాజరైన ప్రతినిదులు నూతన కమిటీనీ ఎన్నుకోవడం జరిగింది.జిల్లా అధ్యక్షుడు గా ఎర్రజి హరీష్,జిల్లా ఉపాధ్యక్షుడు దీపాలక్ష్మి,జిల్లా ప్రధాన కార్యదర్శి మడావి గణేష్,జిల్లా సహాయ కార్యదర్శి దత్తత్రి, జిల్లా కోశాధికారి ఎం.నాగేందర్, జిల్లా కమిటీ సభ్యులు 1)గేడం నితేష్ 2) శంకర్ 3) పూజ 4) గిరిజా లను ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా పిడిఎస్యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ వి శ్రీకాంత్ మాట్లాడుతూ జిల్లా లో యూనివర్సిటీ,ఇంజినీరింగ్ కళాశాల కొత్తగా ఏర్పాటు అయిన మండలాల్లో జూనియర్ కళాశాలలు ఏర్పాటు చేయాలి,పెండింగ్ లో ఉన్న మేస్ బిల్లులు విడదల చేయాలి.రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్ లో ఉన్న 6000 వేల కోట్ల ఫీజు రీయింబర్స్మెంట్,స్కాలర్షిప్ వెంటనే విడదల చేయాలని డిమాండ్ చేస్తున్నాం లేనిపక్షంలో జిల్లా నుండి రాష్ట్ర వ్యాప్తంగా అందోళనలు నిర్వహిస్తామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచరిస్తున్నం అన్నారు.ఈ కార్యక్రమంలో పిడిఎస్యు ప్రతినిధులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## భద్రాచలం దేవస్థానం ఈవో బదిలీని నిలిపివేయాలంటూ నిరసన

భద్రాచలం యదార్థవాది ప్రతినిధి, ఫిబ్రవరి 13: భద్రాచలం సీతారామచంద్రస్వామి దేవస్థానం ఈవో ప్రభుత్వం కీసర ఆర్డీవోగా బదిలీ చేసిందని, వెంటనే ఆమె బదిలీని నిలిపివేయాలని కోరుతూ బీఆర్ఎస్ పార్టీ అధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు స్థానిక అంబేద్కర్ సెంటర్‌లో ప్ల కార్డులు చేబూని మంగళవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకుడు ఆకోజు సునీల్ మాట్లాడుతూ సరిగ్గా ఏడాది క్రితం అలయ ఈవోగా బాధ్యతలు చేపట్టిన రమాదేవి అలయ అభివృద్ధిపై దృష్టి సారించారన్నారు. పురుషోత్తపట్నంలో అలయానికి సంబంధించిన వేలాది ఎకరాల భూముల్లో శాశ్వత కట్టడాలను తొలగించి కాపాడారన్నారు. అటువంటి అధికారిని బదిలీ చేయకుండా ఇక్కడే కొనసాగించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అలాగే దేవస్థానం ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈవో రమాదేవి బదిలీని నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ నల్లబ్యాడ్జీలు ధరించి అలయ అర్చకులు, ఉద్యోగులు, సిబ్బంది నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు భీమవరపు వెంకటరెడ్డి, కోలా రాజు, పామరాజు తిరుమలరావు, మల్లెల లోకేశ్, దాసరి శేఖర్, రామోజు రాముడు తదితరులు పాల్గొన్నారు.

# బద్వేల్ లో నకిలీ ధ్రువపత్రాలతో హల్ చల్

### స్వయంగా రంగంలోకి దిగిన జిల్లా కలెక్టర్
### కొన్ని రిజిస్టర్లు రద్దు చేసిన జిల్లా కలెక్టర్

బద్వేలు యదార్థవాది ప్రతినిధి, ఫిబ్రవరి 13: ప్రభుత్వ భూములకు నకిలీ పత్రాలు తయారు చేయడం వాటిని ఇతరులకు విక్రయించడం బద్వేల్ ప్రాంతంలో పరిపాటిగా మారింది బద్వేలు రెవెన్యూ డివిజన్ అయిన తర్వాత ఈ ప్రాంత భూములకు ఇళ్ల స్థలాలకు ఎక్కడలేని డిమాండ్ ఏర్పడింది డిమాండ్ ఆసరా చేసుకుని ప్రభుత్వ భూములు అక్రమించడం అధికారులను లొంగ తీసుకోవడం అధికార పార్టీ నాయకుల అండదండలతో బద్వేలు పట్టణంలో కొన్ని ముఠాలు హల్ చల్ చేస్తున్నాయి గత సంవత్సరం బద్వేల్ పట్టణం పూర్వపు గుంతపల్లి పంచాయతీ 96/1 సర్వే నెంబర్లు 1.20 ఎకరాల గ్రామ కంఠం భూమి ఉంది ఈ భూమికి సమీపంలోనే జాతీయ రహదారి ఉండడంతో ఈ చుట్టుపక్కల భూములకు ఎక్కడలేని గిరాకీ వచ్చింది భూముల ధరలు అమాంతంగా పెరిగిపోయాయి దాదాపు రెండు కోట్ల రూపాయలు విలువచేసే భూములపై అధికార పార్టీ నేతల కన్ను పడింది ఈ భూమిని సొంతం చేసుకునేందుకు నేతలు చేసిన కుట్రలు బయటపడ్డాయి అ సమయంలో బద్వేలు తాసిల్దార్ గా మల్లికార్జున్ రెడ్డికి ఈ విషయం తెలియడంతో ఈ స్థలాన్ని గ్రామ కంఠం నుంచి చేజారకుండ కట్టుదిట్టం చేశారు కానీ మల్లికార్జున్ రెడ్డి ప్రమోషన్ పై 2023 జనవరి 23వ తేదీ ఇక్కడ నుంచి వెళ్లారు ఇదే అవకాశంగా చేసుకొని మార్చి 28వ తేదీ మల్లికార్జున్ రెడ్డి సంతకం ఫోర్జరీ చేసి అనుభవ పత్రాన్ని తయారు చేశారు 9 మంది పేరిట గ్రామ కంఠం భూమిని రిజిస్టర్ చేసుకునేందుకు కొందరు వైకాపా నాయకులు అన్ని సిద్ధం చేసుకున్నారు దీనిపై అనుమానం వచ్చిన బద్వేలు సబ్ రిజిస్టర్ అప్పుడు తాసిల్దారుగా ఉన్న మధుసూదన్ రెడ్డికి లిఖితపూర్వకంగా చెప్పడం జరిగింది భూములకు సంబంధించిన రికార్డులు పరిశీలించిన తాసిల్దార్ మధుసూదన్ రెడ్డి రిజిస్టర్ కార్యాలయం నుంచి వచ్చిన పత్రాలు సదరు వ్యక్తులకు ఎలాంటి సంబంధం లేదని ఎటువంటి అనుభవ పత్రాలు కూడా తమ కార్యాలయం నుండి ఇవ్వలేదని చెప్పడం జరిగింది దీంతో రిజిస్ట్రేషన్ చివరి దశలో నిలిచిపోయింది ఇప్పటికీ స్థానిక నేతలు అధికారులపై ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం బద్వేలు ఆర్డీవో గా అకుల వెంకటరమణ బాధ్యతలు స్వీకరించిన తర్వాత నకిలీ ముఠాల దందాలు వెలుగులోకి తీసుకురావడంతో రాష్ట్ర వ్యాప్తంగా సంచలనంగా మారింది అయితే ఈ విషయంలో ప్రధాన పాత్ర వహించిన వారిపై ఎలాంటి చర్యలు లేకపోవడంతో అధికార పార్టీ నాయకుల ఒత్తిడితో కేసు నీరు కారిపోయింది ఇటీవల ఫోర్జరీ పత్రాలు అడ్డుపెట్టుకొని రిజిస్టర్ అయిన భూములను స్వయంగా కలెక్టర్ రంగంలోకి దిగి వాటిని రద్దు చేసిన విషయం తెలిసిందే ఇటీవల బద్వేల్ నియోజకవర్గం కాశి నాయన మండలంలో పనిచేస్తున్న ఒక గ్రామ రెవెన్యూ అధికారి నాయకుల పేర్లు చెప్పి భూముల పాస్ పుస్తకాలు తాకట్టు పెట్టడం ప్రభుత్వ భూములను ఇతరుల పేరిట అన్లైన్ చేయడం లాంటి కార్యకలాపాలకు పాల్పడుతున్నడంతో అతనిని ఇతర మండలానికి బదిలీ చేశారు అయినప్పటికీ అక్రమాలు వెలుగు చూస్తూనే ఉన్నాయి అతని బాధితులు కొందరు ఏకంగా వీడియోలు చిత్రీకరించి ప్రజల్లోకి వదలడంతో ఈ వీడియో కూడా సంచలనంగా మారింది మరి ఇంత జరుగుతున్న రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో అక్రమార్కులు మరింత రెచ్చిపోతున్నారు కేసులు నమోదు చేసినప్పటికీ తమకేమీ కాదు అనే ధైర్యం వారికి ఉంది ఇటీవల బద్వేలు మున్సిపాలిటీ పరిధిలోని సర్వే నెంబర్ 798-1 లో 44 సెంట్ల భూమిని అక్రమించి దాని పక్కనే ఉన్న వంకను పూడ్చి అదనంగా నాగుల చెరువు భూమిని కలుపుకొని పట్టపగలే వెంచర్ వేసిన రెవెన్యూ అధికారులు పట్టించుకోలేదు ఈ విషయంలో నీటిపారుదల శాఖ అధికారుల నిర్లక్ష్యం అడుగడుగునా కనిపిస్తుంది పట్టపగలే ఇంత జరుగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు ఏమాత్రం పట్టించుకోకపోవడం విశేషం

# నల్లగొండ సభకు తరలిన ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు

### -బహిరంగ సభకు బస్సులను జెండా ఊపి ప్రారంభించిన ఎమ్మెల్యే



జోగులాంబ గద్వాల జిల్లా యదార్థవాది ప్రతినిధి, ఫిబ్రవరి 13: బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ ఇచ్చిన పిలుపుమేరకు కాంగ్రెస్ ప్రభుత్వం కృష్ణా జలాల నిర్వహణ బాధ్యతను కృష్ణ రివర్ మేనేజ్మెంట్ బోర్డుకు అప్పగించడాన్ని నిరసిస్తూ నల్గొండ జిల్లాలో మంగళవారం నిర్వహించిన బహిరంగ సభకు గద్వాల ఎమ్మెల్యే అధ్వర్యంలో నియోజకవర్గ నుంచి ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున బస్సులలో తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కొట్లాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో పదేళ్ల కేసీఆర్ పాలనలో ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందించడం జరిగిందన్నారు. ముఖ్యంగా రైతాంగానికి నీరు, కరెంటు అందించిన నాయకుడు కేసీఆర్ అని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కృష్ణ జిల్లా ప్రాజెక్ట్ కేంద్ర ప్రభుత్వానికి అప్పగించడం జరిగిందని, దీని వల్ల రైతాంగానికి సాగునీరు, తాగునీరు ఇబ్బందులను ఎదుర్కొనే పరిస్థితి వస్తుందని, ఉమ్మడి నల్లగొండ, మహబూబ్నగర్, ఖమ్మం జిల్లాలలో రైతులకు పెద్ద ఎత్తున నీటి సమస్య ఎదుర్కొనే పరిస్థితి వస్తుందని కేసీఆర్ గ్రహించి అనాడు తెలంగాణ కోసం ఉద్యమ చేశారని, నేడు రాష్ట్రంలో హక్కుల కోసం మరొక ఉద్యమానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతులను ఇబ్బంది కలిగించే పరిస్థితి తెచ్చారని అన్నారు. కృష్ణా జిల్లాలో ప్రాజెక్టుల ఒప్పందాలని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బిఎస్ కేశవ్, ఉమ్మడి జిల్లా డైరెక్టర్ సుభాన్, ఎంపీపీ ప్రతాప్ గౌడ్, రాజారెడ్డి, జెడ్పిటిసి ప్రభాకర్ రెడ్డి, రాజశేఖర్, వైస్ చైర్మన్ బాబర్, కౌన్సిలర్లు, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేతలు రమేష్ నాయుడు, చక్రధర్ రావు, విక్రమ్ సింహారెడ్డి, తూం కృష్ణ రెడ్డి, గద్వాల పట్టణం, అన్ని మండల పార్టీ అధ్యక్షులు, బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిస్టులు కొంత వీధిపోరాటాలు ఎక్కువగానే చేస్తున్నారు. ఉద్యోగుల ఆందోళనలకు మద్దతు ఇవ్వటం ద్వారా సమస్యను బాగాను హైలెట్ చేశారు. ఒక్క అవకాశం అంటూ అధికారంలోకి వచ్చిన జగన్ అరచేతిలో వైకుంఠం చూపించారు. వాస్తవం లో ఆర్థిక సంక్షోభం తీవ్రతరమైంది. ధరలు అకాశాన్నంటుతున్నాయి. సామాన్య ప్రజల అదాయాలు కుంచించుకుపోతున్నాయి. అర్థిక వ్యత్యాసాలు తీవ్రతరమవుతున్నాయి. ఈ సమస్యలను పరిష్కరించటంలో జన్ ప్రభుత్వం ఘోరంగా విఫలమయ్యిందని సిపిఎం నేత వి.శ్రీనివాసరావు ఘాటుగా విమర్శించారు. అప్పులు చేయడం పంచి పెట్టడం అన్నరీతిలో పాలన సాగుతోంది. దీనిని ఎప్పిటికప్పుడు కమ్యూనిస్టులు గట్టిగానే విమర్శిస్తున్నాయి. అమరావతి, విశాఖ స్టీల్, కృష్ణపట్నం తదితర అంశాల్లో పెరుగుతున్న ప్రజా ఉద్యమాలు ఆటంకంగా మారుతున్నాయి. విశాఖ ఉక్కు పరిరక్షణ ఉద్యమం, విద్యార్థుల పోరాటాలు, మహిళ, దళిత, అదివాసీ ఉద్యమాలు, తాజా ఉద్యోగుల ఆందోళన ఇవన్నీ అందులో భాగమే. సమస్యలు పరిష్కరించలేని ప్రభుత్వం ఆందోళనలను నిరంకుశంగా అణచటానికి ప్రయత్నం చేస్తున్నదని వి.శ్రీనివాస రావు అన్నారు. నష్టపోతున్న శ్రామికుల పక్షాన కమ్యూనిస్టులు, కార్మిక తదితర ప్రజాతంత్ర సంఘాలు నిలబడి పోరాడుతున్నాయి. ప్రజల మధ్య ఐక్యత కోసం కమ్యూనిస్టులు పోరాడుతున్నారు. వారిని చీల్చి ప్రజా ఉద్యమాలను బలహీన మతం, ప్రాంతం లాంటి ఏ ఒక్క అంశాన్ని అధికార పార్టీ వదలటం లేదు. ఎపి కూడా అదానీ, అంబానీలకు స్థావరంగా మారింది. గంగవరం పోర్టు వాటాను అదానీపరం చేయటం తాజా ఉదాహరణ. కృష్ణపట్నం ఓడరేవు ఎప్పుడో వారి పరమైపోయింది. ఈ విధానాలను వ్యతిరేకిస్తున్న కమ్యూనిస్టుల ప్రాబల్యాన్ని, ప్రతిష్టను దెబ్బ తీయడానికి ఎర్రజెండాలపై అక్కసు వెళ్లగక్కారని సిపిఎం ప్రధాన కార్యదర్శి వి.శ్రీనివాస రావు మండిపడ్డారు. ప్రత్యేక హోదా ఇవ్వకుండా బిజెపి చేసిన ద్రోహం చేసినా పోరాడలేని అశక్తతలో సిఎం జగన్ ఉన్నారని మండిపడ్డారు. అధికార వైసిపి, ప్రతిపక్ష తెలుగుదేశం వారికి లొంగిపోయి మతోన్మాద రాజకీయాలకు వంత పాడుతున్నాయి. బిజెపి మతోన్మాద ఎజెండాకు ప్రజా ఉద్యమాలు చెక్ పెడుతు న్నాయి. 2019 ఎన్నికల తరువాత బిజెపి ద్రోహంపై ఒక్కసారి కూడా నోరు విప్పని జగన్ మోహన్ రెడ్డి పనిగట్టుకొని కమ్యూనిస్టులపై దాడికి దిగారని అన్నారు. నాడు చంద్రబాబు నాయుడు ప్రపంచబ్యాంకు సంస్కరణలు తీసుకు వస్తే, అవే విధానాలను మరో పేరుతో జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తున్నదన్నారు. ఇద్దరూ తమ సంకుచిత రాజకీయ ప్రయోజనాల కోసం రాష్ట్ర ప్రయోజనాలను ఫణంగా పెడుతున్నారని చెప్పారు. రాష్ట్రానికి బిజెపి ద్రోహం చేసినా ప్రశ్నించటం లేదు. అందుకే కమ్యూనిస్టు పార్టీలు పోరాటాలు చేస్తుంటే అధికార వైసిపికి కంటగింపుగా వుందన్నారు.

-చిత్రహింసలు పెట్టి, బూతు మాటలదండకం

-మా జోలికి వస్తే చావే గతి అంటూ బెదిరింపులు

గజ్వేల్ యదార్థవాది ప్రతినిధి ఫిబ్రవరి 13: ఎలాంటి అనుమతులు లేకుండా గవర్నమెంట్ ఖజానాకు గండి కొడుతూ యదేచ్ఛగా మట్టి తరలింపు చేస్తూ నోట్ల కట్టలు వెనకేసుకుంటూ అడ్డు అదుపు లేని అక్రమ దందా కొనసాగిస్తున్నారు కొందరు, బడా బాబులు, అధికారుల అండదండలతోనే ఈ దందా మూడు పువ్వులు ఆరు కాయలు గా విరాజిల్లుతుంది అని గుసగుసలు వినిపిస్తున్నాయి కొండపాక మండల పరిధిలోని తిమ్మారెడ్డిపల్లి గ్రామ శివారులో అక్రమ మట్టి తరలింపులకు పాల్పడుతున్న మట్టి మాఫియా గ్యాంగ్ ఓ విలేకరిపై విచక్షణారహితంగా దాడి చేసిన అమానుష సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. దాడిలో తీవ్రంగా గాయపడ్డ బాధిత విలేకరి ముత్యాల యాదగిరి కొండపాక మండలం జప్తి నాచారం గ్రామానికి చెందినవాడు. ప్రస్తుతం కలం నిఘా దినపత్రిక లో విలేకరిగా పనిచేస్తున్నాడు. ఈనెల 4వ తేదీన "నోట్ల కట్టలవుతున్న మట్టి కుప్పలు" అనే శీర్షికతో అక్రమ మట్టి తరలింపుకు సంబంధించిన వార్తను రాశాడు. కొమురవెల్లి రైల్వే స్టేషన్ కు సంబంధించిన వంతెన నిర్మాణ పనులలో భాగంగా తీస్తున్న మట్టిని అక్రమంగా కొంతమంది రియాల్టర్లు వెంచర్లకు తరలిస్తున్నారు. ఎలాంటి మంగళవారం మధ్యాహ్నం తిమ్మారెడ్డి పల్లి శివారులో స్నేహితుడితో కలిసి ద్విచక్ర వాహనంపై వెళుతున్న ముత్యాల యాదగిరిని అడ్డుకొని విచక్షణ రహితంగా దాడికి పాల్పడ్డారు. కర్రలు, రాళ్లతో దాడి చేయడంతో యాదగిరి నడవలేని పరిస్థితిలో కూలబడిపోయాడు. ఎండలో దాహంతో బాధపడుతున్న యాదగిరి నీళ్లు ఇవ్వాల్సిందిగా కోరినా కులం పేరుతో ఇష్టం వచ్చిన బూతు మాటలు తిడుతూ పైశాచిక అనందాన్ని అనుభవించారు. మా దందాకు అడ్డు వచ్చే ప్రతి విలేకరిని ఇలాగే దొరకబట్టి కొడతామని, మా వెనక నాయకులు, అధికారులు అండగా ఉన్నారని ఎవరు ఏమి పీకలేరంటూ బెదిరింపులకు పాల్పడ్డారు. అనంతరం అతడిని వారి ద్విచక్ర వాహనం మీద కూర్చోబెట్టుకొని ఎవరూ లేని ప్రదేశంలోకి తీసుకువెళ్లి చంపుతామంటూ హత్యాయత్నానికి పాల్పడగా అందులో ఒకరు, ఇద్దరు వారించి అతనిని తీసుకువచ్చి వెలికట్ట గ్రామ శివారులోని పెట్రోల్ పంపు వద్ద దిగబెట్టి వెళ్ళిపోయారు. తనపై దాడి జరిగిన విషయాన్ని కుటుంబ సభ్యులకు, సహచర జర్నలిస్టులకు తెలపడంతో అందరూ కలిసి యాదగిరి కి అండగా నిలిచి కుకునూరుపల్లి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. జర్నలిస్టు యాదగిరి పై జరిగిన దాడిని టీయూడబ్ల్యూజే సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు కలకుంట్ల రంగాచారి తీవ్రంగా ఖండించారు. జర్నలిస్టుపై దాడి చేసిన ప్రతి ఒక్కరి పైన కఠిన చర్యలు తీసుకోవాలని అయన డిమాండ్ చేశారు.

# ఎచ్చెర్ల వైసీపీలో ఇంటి పోరు

శ్రీకాకుళం యదార్థవాది ప్రతినిధి, ఫిబ్రవరి 13: ఎచ్చెర్ల వైసీపీలో ఇంటి పోరు దాదాపుగా సద్దుమణిగింది. అభ్యర్థి మార్పు విషయంలో హైకమాండ్ ఎలాంటి సూచనలు ఇవ్వకపోవడంతో ఇతర నేతలు తమ ప్రయత్నాలు మానుకున్నారు. శ్రీకాకుళం జిల్లాలోని ఎచ్చెర్ల వైసీపీలో ఇంటి పోరు సిటింగ్ ఎమ్మెల్యేకు చుక్కలు చూపిస్తోంది. గడిచిన ఎన్నికల్లో ఈ నియోజకవర్గం నుంచి గొర్లె కిరణ్ కుమార్.. తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి కిమిడి కళా వెంకటరావుపై విజయం సాధించారు. సుమారు 18 వేల ఓట్లకుపైగా తేడాతో అయన ఘన విజయాన్ని నమోదు చేశారు. వచ్చే ఎన్నికల్లోనూ గొర్లె కిరణ్ కుమార్ మరోసారి ఇక్కడి నుంచి పోటీ చేయాలని భావిస్తున్నారు. కానీ, అయనకు ఇంటి పోరు పెద్ద సమస్యగా పరిణమించింది. గొర్లె కిరణ్ కుమార్ బావమరిది రణస్థలం ఎంపీపీ పిన్నింటి సాయి కుమార్, మేనల్లుడు కంది నాని రూపంలో అయనకు ఇబ్బందికర పరిస్థితి ఎదువుతోంది. వీరిద్దరూ కిరణ్‌కు వ్యతిరేకంగా పావులు కదువుతుండడంతో ఏం జరుగుతుందన్న టెన్షన్ సర్వత్రా నెలకొంది. రాజ్యసభ ఎన్నికలు ఉండడంతో ఈ జిల్లాలోని సీట్ల వ్యవహారంపై వైసీపీ అధిష్టానం చర్చలు జరపడం లేదు. సిటింగ్‌లకే అవకాశాలు కల్పించినట్టు అధిష్టానం నుంచి హామీ లభించినట్టు చెబుతున్నారు. కానీ, రాజ్యసభ ఎన్నికలు పూర్తయ్యేంత వరకు సైలెంట్‌గా ఉండాలని భావించిన వైసీపీ అధిష్టానం.. వ్యూహాత్మకంగానే సిటింగ్‌లకు సీట్లు అన్న అంశాన్ని తెరపైకి తీసువచ్చినట్టు చెబుతున్నారు. రాజ్యసభ ఎన్నికలు తరువాత జిల్లాలోని రెండు, మూడు స్థానాల్లో అభ్యర్థుల మార్పు ఖాయమని చెబుతున్నారు. అందులో ఎచ్చెర్ల ఉంటుందని కిరణ్ వ్యతిరేక వర్గీయులు ప్రచారం చేస్తుంటే.. కిరణ్‌కు టికెట్ కన్ఫార్మ్ అయినట్టు అయన వర్గీలు చెబుతున్నారు. కిరణ్‌కు టికెట్ ఇవ్వవద్దంటూ నియోజకవర్గంలోని పలువురు నేతలు బహిరంగంగానే ప్రకటనలు చేశారు. వీరిలో లుకలాపు అప్పలనాయుడు వంటి నేతలు తమకు టికెట్ కేటాయించాలంటూ కీలక నేతలు చుట్టూ తిరుగుతున్నారు. సొంత బావ మరిది పిన్నింటి సాయి కుమార్ అయితే ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా సమాంతరంగా మరో వర్గాన్ని నడుపుతున్నారు. ఈయన విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావుకు టికెట్ ఇవ్వాలని కోరుతున్నారు. అయన చుట్టూ తన అనుయాయులను వెంట బెట్టుకుని తిరుగుతున్నారు. కొద్దిరోజులు నుంచి సైలెంట్‌గా ఉన్నప్పటికీ తన ప్రయత్నాలను మాత్రం అయన వెనుక నుంచి కొనసాగిస్తున్నారు. ఎమ్మెల్యే మరో బంధువు కంది నాని కూడా ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో దిగేందుకు తీవ్ర స్థాయిలో ప్రయత్నించారు. మంత్రి బొత్స అండదండలు తనకు పుష్కలంగా ఉన్నాయని, తనకు టికెట్ ఖాయమని అని చెబుతూ వస్తున్నారు. ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా కార్యకలాపాలు నిర్వహించలేదు గానీ.. తనకు టికెట్ కోసం మాత్రం ఈయన సైలెంట్‌గా పని చేసుకుంటూ వెళ్లారు. కానీ, వైసీపీ అధిష్టానం జిల్లాలో మార్పులు చేయడం లేదన్న ప్రకటనతో ఈయన సైలెంట్ అయిపోయారు. ఎచ్చెర్ల అసెంబ్లీ స్థానం నుంచి కిరణ్ కుమార్ పోటీకి గ్రీన్ సిగ్నల్‌ను అధిష్టానం ఇచ్చిందన్న ప్రచారం జోరుగా సాగుతోంది. ఎమ్మెల్యే తన అనుచరులు వద్ద అదే చెబుతున్నారు. కానీ, రాజ్యసభ ఎన్నికలు నేపథ్యంలో వైసీపీ అధిష్టానం ఈ మాటను చెప్పిందా.? లేక నిజంగానే ఖరారు చేసిందా..? అన్న విషయం తేలాల్సి ఉంది. ఈ నియోజకవర్గంపై ఇద్దరు కీలక నేతలు కర్చీప్ వేసి ఉంచారు. ఇది కూడా అభ్యర్థి మార్పుపై ఊహాగానాలకు తీవిస్తోంది. విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ఇక్కడి నుంచి బరిలో దిగేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు. ఇప్పటికే పలు మండలాలకు చెందిన నేతలతో అయన టచ్‌లో ఉన్నారు. కానీ, అయన ఎక్కడా ఇక్కడి నుంచి పోటీ చేస్తానని చెప్పడం లేదు. అధిష్టానం గ్రీన్ సిగ్నల్ ఇస్తే అయన బరిలో దిగే చాన్స్ ఉంది. ఒకవేళ ఎంపీ స్థానానికి చిన్న శ్రీను వెళ్లాల్సి వస్తే.. సిటింగ్ ఎంపీకి స్థానం చలనం కల్పించి.. ఇక్కడకు పంపించే అవకాశం ఉందని చెబుతున్నారు. ఎంపీకి ఈ నియోజకవర్గంలో బంధు వర్గం కూడా ఉందని చెబుతున్నారు. ఇవన్నీ, సిటింగ్ ఎమ్మెల్యే కిరణ్ కుమార్‌కు ఇబ్బందిగా పరిణమిస్తున్నాయి. కిరణ్ మాత్రం తనకే టికెట్ వస్తుందని బలంగా చెబుతున్నారు. ఒకవేళ టికెట్ రాకపోతే మాత్రం.. ఇంటిపోరే కిరణ్ కొంప ముంచినట్టు అవుతుందని పార్టీ ముఖ్య నాయకులే పేర్కొంటున్నారు.

# దెయ్యం... భయ్యం

కాకినాడ యదార్థవాది ప్రతినిధి, ఫిబ్రవరి 13: కాండ్రకోట.. 20 రోజులుగా నిత్యం వార్తల్లో నిలుస్తున్న గ్రామం అంది. అక్కడి ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్నారు. అసలు అక్కడ ఏం జరుగుతుందో ఎవరికీ అంతు చిక్కడం లేదు. కాండ్రకోట ప్రజలు 20 రోజులుగా ఓ వింత అకారంతో భయం భయంగా జీవనం సాగిస్తున్నారు. వారికి కంటిమీద కునుకే కరువైంది. ఒక ఇంటిపై నుంచి మరో ఇంటిపైకి, ఒక చెట్టు పై నుంచి మరో చెట్టుపైకి పరుగులు తీస్తూ.. కేకలు పెడుతూ ఆ వింత అకారం కనిపిస్తోంది.అంధ్రప్రదేశ్‌లోని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో కాకినాడ సమీపంలో ఉన్న పెద్దాపురం మండలంలో కాండ్రకోట గ్రామం ఉంది. ఈ ఊరి ఇలవేల్పు నూకాలమ్మ తల్లి. 20 రోజులుగా గ్రామంలో ఒక దుష్టశక్తి గ్రామస్తులను భయపెడుతోంది. సైన్స్ ఇంత అభివృద్ధి చెందిన ఈ రోజుల్లో ఇలాంటివి ఉంటాయా అంటే ఒకరో ఇద్దరో చెబుతున్న



విషయం కాదు ఊరు ఊరంతా ఈ విషయాన్ని నమ్ముతోంది. అది తెలుసుకుంటే మనం కూడా ఏదో శక్తి ఉందని నమ్మాల్సిందే.20 రోజుల క్రితం ఓ వ్యక్తి ఒంటిపై ఎలాంటి బట్టలు లేకుండా నల్లని పొడుగాటి తలతో గ్రామంలో పరుగులు తీశాడట. ఆపై ముగ్గువేసి నిమ్మకాయలతో పూజలు చేశాడట. తర్వాత రెండు రోజులు అతడు కనిపించకుండా పోయాడు. రెండు రోజుల తర్వాత నిత్యం రాత్రివేళల్లో గ్రామంలో కనిపిస్తున్నాడు. ఇళ్లపై దూకడం, చెట్లపై దూకడం, వీధుల్లో అరవడం, ఏడవడం, వంటివి జరుగుతున్నాయి. దీంతో గ్రామస్తులు కర్రలు, లైట్లు పట్టుకుని రాత్రంతా కాపలా కాస్తున్నారు. అయినా ఏదో ఒక చెట్టుపై నుంచి ఇంటిపైకి దూకడం చూస్తున్నారు. తాజాగా ఒక మామిడి చెట్టుపై నుంచి కిందకు దూకి ఓ ఇంటి తలుపులు బద్దలు కొట్టే ప్రయత్నం చేసిందని స్థానికులు చెబుతున్నారుగ్రామస్తులను భయపెడుతున్న ఆ వ్యక్తి ఎవరు అన్నది అంతు చిక్కడం లేదు. దెయ్యమని కొంతమంది అంటుంటే దుష్టశక్తి అని మరికొందరు అంటున్నారు. ఈ రెండూ కాదు.. ఎవటో సగటు వ్యక్తి ఇదంతా చేస్తున్నాడు అని గ్రామంలో పుకార్లు షికార్లు చేస్తున్నాయి. పట్టుకోవడం మాత్రం వారివల్ల కావడం లేదు. దీంతో చిన్న పిల్లల నుంచి పెద్దవారి వరకు చీకటి పడితే భయంతో వణికిపోతున్నారుగ్రామాన్ని ఏదో దుష్టశక్తి ఇబ్బంది పెడుతుందని భావించిన గ్రామస్తులు శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. హోమం జరిపించారు. తమ సమస్యను ఎవరూ పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు.

## పులువెందులలో కుడా టీడీపీ గెలవబోతోంది

విజయవాడ యదార్థవాది ప్రతినిధి, ఫిబ్రవరి 13: కంచికచర్ల మండలంలో టిడిపి నాయకులు కేశినేని శివనాద్ (చిన్ని) పర్యటిస్తున్నారు. కేశినేని చిన్ని, మాజీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్యకి భారీ ర్యాలీ లతో టిడిపి నాయకులు ఘన స్వాగతం పలికారు. పెండ్యాల గ్రామాల్లో భారీ బైక్ ర్యాలీతో స్వాగతం పలికారు. కంచికచర్ల మండల కీసర,పెండ్యాల,వేములపల్లి అమరవరం గ్రామాలలో కేశినేని చిన్ని పర్యటించారు. చిన్ని మాట్లాడుతూ గత ఎన్నికల్లో ఒక ఛాన్స్ ఇచ్చి అందరూ మోసపోయాం. నందిగామలో ఇద్దరు సైకోలతో పాటు మూడో సైకో కూడా బయలుదేరాడు. నందిగామలో తంగిరాల సౌమ్యను భారీ మెజార్టీతో గెలిపించాలి . వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో టిడిపి-జనసేన ప్రభుత్వం అధికారంలోకి రాబోతుంది. 175 స్థానాలకు గాను జనసేన, టిడిపి 160 స్థానాల్లో గెలవబోతోంది. పులివెందులలో కూడా టిడిపి గెలవబోతుంది. ఇంకా ఎన్నికలకు మనకు 65 రోజులు మాత్రమే సమయం ఉంది. రాష్ట్రంలో రాక్షస పాలన సాగనంపాలనిఅన్నారు.

## మానవత్వాన్ని చాటుకున్న యువ సంకల్ప ఫౌండేషన్ సభ్యులు..

పెద్దపల్లి యదార్థవాది ప్రతినిధి, ఫిబ్రవరి 13: సుల్తానాబాద్ పట్టణంలోని యువ సంకల్ప ఫౌండేషన్ అధ్వర్యంలో గత 4 5. రోజులుగా వేరే ప్రాంతాల నుండి వచ్చి మతిస్థిమితం లేక సుల్తానాబాద్ పట్టణానికి వచ్చి రోడ్డు పక్కన పడవేసిన కుళ్ళిపోయిన అహార పదార్థాలను తింటూ జీవనం గడుపుతున్న అభాగ్యులను చూసిన ఫౌండేషన్ అధ్యక్షుడు తుమ్మ రాజ్ కుమార్ వారికి ప్రత్యేక దృష్టి సాధించి గత మూడు రోజుల నుండి ఆహారం అందించడం జరుగుతుంది. ఆ కార్యక్రమంలో భాగంగా ఫౌండేషన్ సభ్యులు దేశెట్టి రమేష్ తో కలిసి సుల్తానాబాద్ పట్టణంలో మతిస్థిమితం లేక అనాధలుగా ఎక్కడినుండో ఈడికి వచ్చి ఉన్న వారిని ప్రత్యేక దృష్టి సాధించి ఈరోజు వారికి అన్నదాన కార్యక్రమం చేయడం జరిగినది. ఈ సందర్భంగా రాజ్ కుమార్ మాట్లాడుతూ వీరికి మతిస్థిమితం లేకపోవడం. వల్ల మేము రోజు పంపిణీ చేసే అన్నదాన కార్యక్రమం కాడికి రాలేకపోతున్నారని. ఈ మధ్యకాలంలో రోడ్డు ప్రక్కన పడేసిన కుళ్ళిపోయిన అహార పదార్థాలు తింటూ కనిపించడంతో వీరి కోసం తిరుగుతూ వీరిని దగ్గరికి వెళ్లి అన్నదానం అందించడం జరుగుతుందని దయచేసి మానవత్వం గలవారు ఎవరైనా వీరు కనిపిస్తే ఒక్కపూట భోజనం పెట్టి వీళ్ళ కడుపు నింపాలని కోరడం జరిగినది. అన్నం పరబ్రహ్మ స్వరూపం అన్న సంకల్పంతోటి ఈ యువ సంకల్ప ఫౌండేషన్ స్థాపించినమని దానిలో భాగంగా మాకు చేతనైన ప్రతి సహాయాన్ని చేసుకుంటూ వెళుతున్నామని ఈ యొక్క కార్యక్రమాలలో ప్రతి ఒక్కరూ భాగ్యసాములు కావాలని కోరడం జరిగినది.



## ప్రజలు తప్పకుండా ట్రాఫిక్ రూల్స్ పాటించాలి

### జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత

నిజామాబాద్ యదార్థవాది ప్రతినిధి, ఫిబ్రవరి 13: ప్రజలు తప్పకుండా ట్రాఫిక్ రూల్స్ పాటించాలి అని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత అన్నారు. 35వ జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలు సందర్భంగా మంగళవారం జిల్లాలోని మేఘన ఇనిస్టిట్యూట్ అఫ్ డెంటల్ సైన్స్ వారి అధ్వర్యంలో ఓరల్ అండ్ మ్యాక్సో ఫేషియల్ సర్జరీ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రభుత్వ వైద్యశాల నుండి ఏర్పాటు చేసిన ట్రాఫిక్ రోడ్డు సేఫ్టీ అవగాహన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నిజామాబాద్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల, నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ సింగెనవార్ హాజరై జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. ఈ ర్యాలీ ప్రభుత్వ హాస్పిటల్ నుండి ప్రారంభమై అర్టీసీ బస్టాండ్ తిలక్ గార్డెన్ రైల్వే స్టేషన్ - ఎన్టీఆర్ చౌరస్తా పోలీస్ పరేడ్ గ్రౌండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాలా మాట్లాడుతూ యువతే దేశ భవిష్యత్? అలాంటి యువత రోడ్డు ప్రమాదాల బారిన పడి మంచి భవిష్యత్తును కోల్పోకూడదు అని సూచించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ అవగాహన కార్యక్రమాలే ప్రధానమని, వాహనదారులు ప్రతి ఒక్కరూ లైసెన్స్ తీసుకోవాలని, రోడ్డు ప్రమాదాల నుండి దూరంగా ఉండాలని అన్నారు. యువత సమాజానికి అదర్శంగా ఉండాలని, చట్టాలను గౌరవించి వాటిని పాటించాలని, రోడ్డు ప్రమాదాలలో ముఖానికి లేదా శరీరానికి బలమైన గాయాలు లేదా ఎముకలు విరిగినప్పుడు సర్జరీ ద్వారా బాగు చేయవచ్చని, కానీ తలకి గాయం అయితే చాలా కష్టం కాబట్టి హెల్మెట్? ధరించకుండా అజాగ్రత్తగా వాహనం నడిపి. తమను నమ్ముకున్న తల్లిదండ్రులకు గర్భశోకం రాకుండా చూడాలని తెలియజేశారు. కావున యువత తప్పకుండా వాహనం నడిపేటప్పుడు హెల్మెట్? ధరించాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. అనంతరం పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకోసం రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటుందని, అయినా ఎంతో మంది రోడ్డు ప్రమాదాలలో మరణిస్తున్నారని అన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకోసం వాహనాదారులు తప్పకుండా ట్రాఫిక్ రూల్స్ పాటించాలని, ప్రధానంగా ద్విచక్ర వాహనాదారులు హెల్మెట్? ధరించాలని, కారు డ్రైవింగ్ చేసేటప్పుడు సీట్?బెల్టు ధరించాలని, డ్రైవింగ్ చేస్తూ సెల్ ఫోన్ మాట్లాడకూడదు అన్నారు. నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా ప్రతి సంవత్సరం రోడ్డు ప్రమాదాలన వలన దాదాపు 320 మంది మరణిస్తున్నారని, 680 మంది క్షతగాత్రులు అవుతున్నారని తెలిపారు. మేఘన డెంటల్ కాలేజీలో విద్యార్థులకు స్పెషల్ డ్రైవ్ ద్వారా రీజినల్ ట్రాన్స్పోర్టు శాఖ ద్వారా స్పెషల్ డ్రైవ్ నిర్వహించి ప్రతి ఒక్కరికి డ్రైవింగ్ లైసెన్స్ ఇప్పిస్తామని అన్నారు. డాక్టర్ సాయిచంద్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు ముఖానికి తగిలిన గాయాలకు గాను మేఘన దంత వైద్య కళాశాలలో అతి తక్కువ ఖర్చుతో అత్యాధునిక పరికరాలతో చికిత్స నిర్వహిస్తున్నట్టు తెలిపారు. రోడ్డు ప్రమాదాలు ఏ విధంగా జరుగుతున్నాయో అని నృత్య ప్రదర్శన ద్వారా విద్యార్థులు తెలియజేశారు. ఈ సందర్భంగా పోలీస్ సిబ్బందికి హెల్మెట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా అదనపు డిప్యూటీ కమిషనర్ అఫ్ పోలీస్ (లా అండ్ అర్డర్) ఎస్. జయ్ రామ్, ప్రొబేషనరీ ఐపీఎస్ బి. చైతన్య రెడ్డి, ట్రాఫిక్ ఏసీపీ టి. నారాయణ, నిజామాబాద్ ఏసీపీ కిరణ్ కుమార్, హోమ్ గార్డ్స్ ఏసీపీ పి.అరుణ్ కుమార్, ట్రాఫిక్ సీఐ వెంకట్ నారాయణ, ట్రాఫిక్ అర్ఐ సతీష్, డా.కళ్యాణ చక్రవర్తి ( వైస్ ప్రిన్సిపాల్), డా. అమర్నాథ్? (హెడ్ అఫ్ ది డిపార్టుమెంటు), డా.ప్రవీణ్ కుమార్ (హెడ్ అఫ్ ది డిపార్డుమెంటు ), డా.శోభారాణి ( ప్రొఫెసర్), డా.సాయిచంద్ ( అసోసియేట్ ప్రొఫెసర్) రమణరావ్ ( ఏఓ), ఐ రాడ్ మేనేజర్ ఎమ్. వర్షా నిహంత్ తదితరులు పాల్గొన్నారు.



మహేష్‌బాబు, ఎస్ఎస్.రాజమౌళి కాంబోలో 'ఎస్ఎస్ఎంబీ 29' సినిమా ప్రకటించినప్పటి భారీ అంచనాలు నెలకొన్నాయి. సినిమా ఇంకా ప్రారంభం కాలేదు కానీ సినిమాపై రకరకాల వార్తలు పుట్టుకొస్తున్నాయి. సినిమా కథ నుంచి నటీనటుల వరకూ ఏదో ఒక వార్త సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. తాజాగా మరో వార్త నెట్టింట షికారు చేస్తోంది. ఈ చిత్రం హీరోయిన్ ఎవరనే అంశం ఇప్పుడు ట్రెండింగ్‌లో ఉంది. పాన్ వరల్డ్ స్థాయిలో ఈ సినిమాని తెరకెక్కించనున్న రాజమౌళి.. దానికి తగ్గట్లు విదేశీ నటులనూ ఎంపిక చేసుకునే ఆలోచనలో ఉన్నారని టాక్. ఈ మేరకు ఇండోనేషియా నటి చెల్సియా ఎలిజబెత్ ఇస్లాన్ ఇందులో హీరోయిన్‌గా నటించే అవకాశాలున్నాయనే వార్త వైరల్ అవుతోంది. చెల్సియా తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో రాజమౌళిని ఫాలో అవుతుండడంతో ఆ వార్తలకు బలం చేకూరినట్లైంది. ఇంతకుముందు బాలీవుడ్ హీరోయిన్ ఒకరు మహేశ్ సరసన నటించే ఛాన్స ఉందంటూ గాసిప్స్ వచ్చిన సంగతి తెలిసిందే. ఇందులో ఎంత నిజం ఉందనేది తెలియాలంటే జక్కన్న నోరు విప్పాల్సిందే! ప్రస్తుతం ఈ చిత్రం ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగుతు న్నాయి. మార్చి చివర్లో లేదా ఏప్రిల్‌లో ఈ చిత్రం సెట్స్ మీదకెళ్లనుందని తెలుస్తోంది. చెల్సియా గురించి చెప్పాలంటే ఆమె జకార్తాలో చదువు పూర్తి చేసి 2013లో హాలీవుడ్ ఫిల్మ్ 'రి÷-రెన్'తో వెండితెరకు పరిచయం అయింది. తర్వాత 'స్ట్రీట్ సొసైటీ', 'హెడ్‌షాట్', 'మే ది డెవిల్ టేక్ యు' తదితర సినిమాలతో మంచి గుర్తింపు పొందింది. మరోవైపు, మార్వెల్ సినిమాలతో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు సంపాదించుకుంది. ప్రస్తుతం క్రిస్ హెమ్స్‌వర్త్ ఈ చిత్రంలో కీలక పాత్ర పోషించనున్నారని కథనాలు వస్తున్నాయి. వీటిలో నిజమెంతో తెలియాలంటే అధికారిక ప్రకటన వెలువడాల్సిందే.

# ఎట్టకేలకు వీరమల్లు అప్డేట్




పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ఆ మధ్య వరుస పెట్టి సినిమాలకు ఓకే చెప్పారు. ఆ తర్వాత ఆయన రాజకీయాల్లో బిజీ అవడంతో ఆ సినిమాలన్నీ ఆగిపోయాయి. ఇప్పటికే మూడు చిత్రాలు నిలిచిపోయాయి. అయితే చాలా కాలం తర్వాత ఈ మూవీల నుంచి మెల్లమెల్లగా ఒక్కో అప్డేట్ వస్తోంది. దీంతో పవన్ ఫ్యాన్స్ అంతా ఫుల్ ఖుషీ అవుతున్నారు. తాజాగా మెగా సూర్య ప్రొడక్షన్స్.. హరిహర వీరమల్లు సినిమా అప్డేట్ ఇచ్చింది. పవన్ కళ్యాణ్ హీరోగా డైరెక్టర్ క్రిష్ దర్శకత్వంలో వస్తున్న సినిమానే హరిహర వీరమల్లు. అయితే పవన్ కెరీర్ లోనే అత్యంత భారీ బడ్జెట్ తో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. క్రిష్- పవన్ కాంబినేషన్ లో వస్తున్న తొలి చిత్రం కూడా ఇదే కావడంతో పెద్ద ఎత్తున అంచనాలు నెలకొన్నాయి. ముఖ్యంగా పవన్ ను ఇప్పటి వరకు పీరియాడిక్ సినిమాల్లో చూడకపోవడం కూడా దీనిపై బజ్ కు కారణం అయింది. ఈ సినిమా షూటింగ్ సుమారు నాలుగేళ్ల క్రితం మొదలైంది. క్రిష్ దర్శకత్వంలో మొదట్లో చిత్రీకరణ జోరుగా సాగింది. ఆ తర్వాత కరోనా రావడంతో బ్రేకులు పడ్డాయి. ఇక అప్పటి నుంచి ఈ మూవీకి అనేక ఇబ్బందులు వచ్చాయి. అసలు ఈ ప్రాజెక్ట్ ఉంటుందో.. లేదో అన్న అనుమానాలు వచ్చాయి. ఒక్క గ్లింప్స్ మినహా పెద్దగా అలాంటి అప్డేట్లు రాలేదు. దర్శకుడు క్రిష్ ఈ ప్రాజెక్ట్ నుంచి తప్పుకున్నారంటూ కూడా రూమర్లు బయటకు వచ్చాయి. ఈ నేపథ్యంలో హరిహర వీరమల్లును నిర్మిస్తున్న ప్రొడక్షన్ హౌస్ క్రేజీ అప్డేట్ ఇచ్చింది. కొన్ని సిటీల్లో ఈ సినిమా వీఎఫ్ ఎక్స్ పనులు జరుగుతున్నాయని పేర్కొంది. "విప్లవ యోధుడి సినిమా హరిహర వీరమల్లు గురించి అప్డేట్ కోసం ఉత్సాహంగా ఎదురుచూస్తున్న పవర్ స్టార్ అభిమానులు, సినిమా ప్రేమికులందరికీ.. ప్రస్తుతం ఈ ప్రతిష్ఠాత్మక సినిమా హైఎండ్ వీఎఫ్ ఎక్స్ పనులు ఇరాన్, కెనడా, బెంగళూరు, చెన్నై, హైదరాబాద్ ప్రాంతాల్లో జరుగుతున్నాయి. మీ ఊహలను మించి మా చిత్రం ఉంటుంది. అందుకే అలాగే థ్రిల్ తో ఉండండి" అని మెగా సుప్రియా ప్రొడక్షన్స్ వెల్లడించింది. హరిహర వీరమల్లు చిత్రానికి సంబంధించి స్పెషల్ ప్రోమోను త్వరలోనే రిలీజ్ చేయనున్నట్లు కూడా నిర్మాణ సంస్థ వెల్లడించింది. ప్రోమో అద్భుతంగా ఉంటుందని తెలిపింది. అయితే తమ ప్రకటనలో క్రిష్ గురించి ఎలాంటి ప్రస్తావన చేయలేదు. మరి ఆ ప్రోమో ద్వారా ఈ విషయంపై క్లారిటీ ఇస్తుందేమో చూడాలి. హరిహర వీరమల్లు సినిమా మొఘలుల కాలం నాటి బ్యాక్ డ్రాప్ లో రూపొందుతోంది. ఈ చిత్రంలో భారత యోధుడిగా పవన్ నటిస్తున్నారు. బాలీవుడ్ స్టార్ నటుడు బాబీ డియోల్ కీలక పాత్ర పోషిస్తుండగా.. నిధి అగర్వాల్ హీరోయిన్ గా యాక్ట్ చేస్తున్నారు. ఆస్కార్ అవార్డ్ విన్నర్ ఎంఎం కీరవాణి ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. ఈ మూవీ పాన్ ఇండియా రేంజ్ లో విడుదల కానుంది.

## యాధార్ధ సంఘటన ఆధారంగా అనుష్క సినిమా!

స్వీటీ అనుష్క- క్రిష్ అభిమానుల్ని ఒక్కసారిగా సడెన్ సర్ ప్రైజ్ చేసిన సంగతి తెలిసిందే. కనీసం గాసిప్ కూడా లేకుండా ఇద్దరి సినిమా పట్టాలెక్కడం అందర్నీ ఆశ్చర్యపరిచింది. అనుష్కని మెయిన్ లీడ్ లో పెట్టి ఏకంగా ఓ లేడీ ఓరియేంటెడ్ సినిమాకే తెర తీసారు. దీన్ని అంతే ప్రతిష్టాత్మకంగా యూవీ క్రియేషన్స్ నిర్మిం చడం విశేషం. పడిపోయిన అనుష్క గ్రాప్ ని మళ్లీ పైకి లేపాలని యూవీ-క్రిష్ ఈ బాధ్యతలు తీసుకున్నట్లు తెలుస్తోంది. సోలోగా బాక్సాఫీస్ వద్ద అనుష్క సత్తా ఏంటో చూపించాలని యూవీ సంస్థ ముందుకొచ్చి చేస్తోన్న చిత్రం. ప్రేమికుల రోజున అతిగా అంచనా వేయకు సదరు సంస్థతో అనుష్క బాండింగ్ తోనే ఇది సాధ్యమైందన్నది తెలిసిందే. మరి క్రిష్..అనుష్కని ఎలాంటి కథలో చూపించబోతున్నాడు? అంటే సంచలన అంశాన్ని స్టార్ మేకర్ టచ్ చేస్తున్నట్లు లీకులందు తున్నాయి. ఏకంగా మహిళా లోకమే దిగొచ్చేలా క్రిష్ సరైన పాయింట్ నే ఎత్తుకున్నట్లు వినిపిస్తోంది. ఒడిశాల్లో ఓ అమ్మాయి జీవితంలో చోటు చేసుకున్న యధార్ధ సంఘటన ఆధారంగా ఈ చిత్రం రూపొందు తుందని టాక్ వినిపిస్తుంది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ ఒడిశాల్లో జరుగుతోన్న సంగతి తెలిసిందే. ఇటీవలే అనుష్క ఓ హోటల్ నుంచి వస్తోన్న వీడియో బయటకు వచ్చింది. ఆ స్పాట్ ఎక్కడ? అంటే ఒడిశా అని తేలింది. దానికి సంబంధించిన తీగ కదిపితే ఇలా డొంకంతా కదులుతుంది. తొలి షెడ్యూల్ ఒడిశాల్లో చేయడానికి



కారణం కూడా అదే అంటున్నారు. అనుష్కపై అక్కడ కీలక సన్నివేశాలు చిత్రీకరిస్తున్నారని సమాచారం. అయితే ఆ అమ్మాయికి జరిగిన యధార్ధ సంఘటన ఎలాంటిది అన్న వివరాలు మాత్రం ఇంకా బయటకు రాలేదు. అయితే ఈఘటన చాలా కాలం క్రితం చోటుచేసుకున్నందని అంటున్నారు. ఒకప్పుడు ఒడిశా పేరు ఒరిస్సాగా ఉండేది. సినిమాలో ఆ పాత పేరు టైటిల్స్ లో కనిపిస్తుందని సమాచారం. అంటే ఈ ఘటన చాలా పాతదని తెలుస్తోంది. అంటే పదేళ్ల క్రితం నాటి ఘటన అని చెప్పొచ్చు. 2011 లోనే ఒరిస్సా పేరు ఒడిశాగా మారింది. ఏది ఏమైనా క్రిష్ టచ్ చేసిన పాయిట్ అసామన్యమైనదిగా ఉంటుందనడంలో సందే హం లేదు. అందులోనూ యధార్ధ గాథలో ఎమోషన్ చూపించడంలో క్రిష్ చెలరేగిపోతాడు.

# షాడో ఇమేజ్ కాదు..దమ్ముంటే నా ఫోటో వేయండి



షాడో ఇమేజ్ పెట్టి కాదు.. దమ్ముంటే నా ఫొటో వేసి.. నిర్మాత ఇంట్లో మద్యం తాగాడని రాయ్.. అంటూ బ్లాక్‌బస్టర్ డైరెక్టర్ హరీష్ శంకర్ సీరియస్ అయ్యారు. మాస్ మహారాజా రవితేజ హీరోగా నటించిన 'ఈగల్' మూవీ సక్సెస్ మీట్‌ను హైదరాబాద్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హరీష్ శంకర్ అతిథిగా హాజరయ్యారు. 'ఈగల్' సినిమాపై వస్తున్న ట్రోలింగ్ గురించి మాట్లాడుతూ.. తనపై లేనిపోని వార్తలు రాస్తున్న వారిపై ఆయన ఫైర్ అయ్యారు. మేము ఏ పొలిటికల్ అజెండా లేకుండా సినిమాలు తీయాలి. సినిమా అంటే ఒకటి కళాత్మకం.. రెండోది వ్యాపారం. నా సినిమా అన్ని పార్టీల వాళ్లు చూడాలని కోరుకుంటా. ఒక వర్గాన్ని దూరం చేసుకోవాలనే ఆలోచన నాకు ఎందుకు ఉంటుంది. పవన్ కళ్యాణ్ గారు కూడా నా గురించి చెప్పారు. 'మీరు సినిమా డైరెక్టర్. జనసేనకు సంబంధించి కానీ, వేరే ఇతరత్రా విషయాలలో కానీ మీరు రియాక్ట్ అవ్వాల్సిన అవసరం లేదు'ని స్ట్రిక్ట్‌గా చెప్పారు. మేము ఏ సినిమా చేస్తున్నా.. హౌస్‌ఫుల్ అవ్వాలని అనుకుంటాం. మాకు ఎటువంటి అజెండాలు ఉండవు. కార్తిక్ రెండో సినిమా చేసుకుంటున్నాడు. మేము ఉన్నాం కదా.. మా మీద సెటైర్లు వేసుకోండి. మేము రెడీ. అతనిపై సెటైర్లు ఆపండి. ఒక చిన్న లైన్ మిస్ అవుతున్నాం. క్రిటిసిజమ్‌కి, ట్రోలింగ్‌కు తేడా తెలియకుండా పోతుంది. విమర్శ వేరు.. ఎద్దేవా, ఎగతాళి వేరు. ఎవరో సోషల్ మీడియాలో ట్రోల్ చేశారంటే అర్థం ఉంది. మన రివ్యూస్ కూడా ట్రోల్ చేసే విధంగా ఉన్నందుకు బాధేస్తుంది. నాలుగు సంవత్సరాల నుండి సినిమా లేదు.. నిర్మాత ఇంట్లో కూర్చుని తెల్లవార్లు మద్యం తాగాడు ఓ డైరెక్టర్.. ఇతను పవన్ కళ్యాణ్‌తో బ్లాక్‌బస్టర్ కొట్టాడు అంటే.. ఇంకెవరు? మొత్తం రాసే ధైర్యం ఉండదు.. ఒక షాడో ఇమేజ్ పెడతారు. రా.. దమ్ముంటే నా ఫొటో వేసి.. హరీష్ శంకర్ తెల్లవార్లు తాగాడు అని రాయ్. నీ కౌంటర్‌కి నేను కౌంటర్ వేస్తాను. అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. మాటకు ముందు గ్యాప్ వచ్చింది అంటుంటాడు. నేనిప్పుడు రెండు సినిమాలు చేస్తున్నా. 'ఉస్తాద్ భగత్ సింగ్', 'మిస్టర్ బచ్చన్'. అతి త్వరలో పెద్ద హీరోలతో మరో రెండు సినిమాలు ప్రకటించబోతున్నా. ఇదేమన్నా ప్రొగ్రెస్ రిపోర్టా? మా నాన్నలాగా ఫీజ్ కట్టావా.. నేను ఏం చేస్తున్నానో నీకు చూపించడానికి?. నాలుగు కాకపోతే ఐదేళ్లు కుదరదు. నీకు ప్రాబ్లమ్ ఏంటి? నీ ఇంటికి వచ్చి ఏమైనా అడుగుతున్నానా? నా రెంట్ కట్టండని. ట్రోలింగ్ మాకేం కొత్తకాదు. మేము సినిమా రంగంలోకి అడుగుపెట్టేటప్పుడే.. మా అమ్మనాన్నలే మాపై మొదట ట్రోల్ చేశారు. సినిమా పుట్టాకే వెబ్‌సైట్స్ పుట్టాయ్. వెబ్‌సైట్స్ పుట్టాక సినిమా పుట్టలేదు. అన్నిటికి తెగించి.. ఎన్నో సౌకర్యాలు, సుఖాలు త్యజించి ఇక్కడకొచ్చి నిలబడ్డాం. అందరినీ అనడం లేదు. మళ్లీ అందరూ భుజాలు తడుముకోకండి. అని హరీష్ శంకర్ సీరియస్ అయ్యారు.

# మళ్లీ మేకప్ వేసుకోనున్న సమంత



మయోసైటిస్ అనారోగ్య కారణంతో సినిమాలకు కాస్త గ్యాప్ ఇచ్చిన అగ్ర కథానాయిక సమంత మళ్లీ చురకుగా నటనకు రాబోతోంది . తను అంగీకరించిన చిత్రాలు, సిరీస్‌లు పూర్తి చేసి ప్రస్తుతం రెస్ట్‌లో ఉంది. ఈ గ్యాప్‌లో విదేశాల్లో చికిత్స పొందింది సామ్. తాజాగా సమంత నుంచి అభిమానులకు తీపి కబురు అందింది. సమంత బ్యాక్ టు వర్క్ అని సోషల్ మీడియాలో ఓ వార్త వైరల్ అవుతోంది. త్వరలో మళ్లీ షూటింగ్‌లో పాల్గొంటున్నట్లు అభిమానులకు తీపి కబురు వినిపించింది. గతేడాది 'శాకుంతలం', 'ఖుషి' చిత్రాలతో ప్రేక్షకులను అలరించిన సమంత 'సిటాడెల్' చిత్రీకరణ తర్వాత సినిమాల నుంచి విరామం తీసుకుంది. తాజాగా సినిమా చిత్రీకరణను మొదలు పెడుతున్నట్లు తెలుపుతూ ఇన్స్టా వేదికగా ఓ 'ఇప్పటికే చాలా మంది ఎప్పుడు షూటింగ్ సెట్‌లో కనిపిస్తారని అడుగుతున్నారు. ఇప్పుడు ఆ టైమ్ రానే వచ్చింది. 'నేను త్వరలో మళ్లీ నా పనిని ప్రారంభించబోతున్నాను. కొన్ని రోజులుగా నేను ఒక నిరుద్యోగిగా ఖాళీగా ఉన్నాను. ఇటీవల నేనునా స్నేహితులు కలిసి హెల్త్ పాడ్‌కాస్ట్‌పై ఓ కార్యక్రమం చేశాం. త్వరలో దాన్ని విడుదల చేస్తాం' అని చెప్పారు సమంత. అయితే సమంత తదుపరి చిత్రాలు ఏంటనే విషయంపై ఎలాంటి క్లారిటీ లేదు. తను నటించిన సిటాడెల్ సిరీస్ విడుదలకు సిద్ధమవుతోంది. రాజ్ అండ్ డీకే ఈ సిరీస్‌కు దర్శకులు.

## నా ఫస్ట్ సీరియల్‌కే నంది అవార్డు వచ్చింది.. కానీ ఇంకా ఇవ్వలేదు.. ఏపీ ఎన్నికల వేళ జబర్దస్త్ రోహిణి పోస్టు వైరల్

కమెడియన్ రోహిణి గురించి తెలుగు ప్రేక్షకులకు పెద్దగా పరిచయం చేయాల్సిన అవసరం లేదు. సీరియల్ నటిగా ఇండస్ట్రీలోకి వచ్చిన రోహిణి.. జబర్దస్త్ కామెడీ షోతో అందరి ఫేవరేట్‌గా మారింది. ఆ తర్వాత బిగ్‌బాస్ హౌస్‌లోకి కూడా ఎంట్రీ ఇచ్చి మరింత దగ్గరైంది. ఇప్పుడు సినిమాలు, వెబ్ సిరీస్‌లతో ఫుల్ బిజీగా మారిపోయిన రోహిణి.. సోషల్‌మీడియాలో రీసెంట్‌గా చేసిన ఓ పోస్టు ఇప్పుడు వైరల్‌గా మారింది. సార్వత్రిక ఎన్నికలు దగ్గర పడుతుండటంతో ఏపీ ప్రభుత్వంపైనే రోహిణి సెటైర్లు వేసిందని తెగ ప్రచారం జరుగుతోంది. 2014 సంవత్సరానికి సంబంధించిన నంది అవార్డులను 2018లో అప్పటి ఏపీ ప్రభుత్వం ప్రకటించింది. ఆ సమయంలో కొంచెం ఇష్టం కొంచెం కష్టం సీరియల్‌లో తన నటనకు గానూ రోహిణిని బెస్ట్ టీవీ కమెడియన్ అవార్డు వరించింది. ఈ విషయాన్ని తెలియజేస్తూ ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఫిలిం టెలివిజన్ అండ్ థియేటర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ ఓ లెటర్‌ను కూడా రోహిణికి పంపించింది. తొందరలోనే నందిఅవార్డుల వేడుకనిర్వహించి అవార్డుతో పాటు పది వేల నగదు బహుమతిని అందజేస్తామని లేఖలో పేర్కొంది. ఈ లెటర్‌నే తాజాగా జబర్దస్త్ రోహిణి ఇన్‌స్టాగ్రామ్ వేదికగా షేర్ చేసింది. నాఫస్ట్ సీరియల్‌కు నంది అవార్డు వచ్చింది. కానీ ఇప్పటివరకు నాకు అది అందలేదు. నా కెరీర్‌లో కొంచెం ఇష్టం కొంచెం కష్టం సీరియల్ ఒక మంచిజ్ఞాపకం. గతంలో నేను సాధించిన దాన్ని కేవలం ఇలా షేర్ చేయాలని అనుకుంటున్నాఅనిపోస్టు చేసింది. ఈ పోస్టు క్షణాల్లోనే వైరల్‌గా మారింది. చాలామంది నంది అవార్డు వరించినందుకు రోహిణిని ప్రశంసిస్తున్నారు. అయితే.. ఏపీ అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో రోహిణి ఈ పోస్టు చేయడంతో దీన్ని చాలామంది నెటిజన్లు రాజకీయంగానే చూస్తున్నారు. అప్పుడెప్పుడో అవార్డులు ప్రకటించి ఇవ్వకపోతే.. ఇప్పుడు ఎందుకు పోస్టు చేస్తున్నావ్ అని ప్రశ్నిస్తున్నారు. ఎలక్షన్ టైమ్ కదా అని గుర్తుకువస్తాయి అని మరికొందరు కామెంట్లు పెడుతున్నారు.

యదార్థవాది తెలుగు దినపత్రిక

బుధవారం 14-02- 2024

# రైతు పక్షమా..అమెరికాకు దాసోహమా?




## డబ్ల్యూటిఓలో భారత్ వైఖరిపై సర్వత్రా ఆసక్తి

న్యూఢిల్లీ : నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం అన్నదాతలకు అసరాగా నిలుస్తుందా లేక అమెరికాకు కొమ్ము కాస్తుందా అనే విషయం త్వరలోనే తేలిపోతుంది. ఈ నెల 26న అబుధాబీలో ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటిఓ) మంత్రుల స్థాయి సమావేశం జరగబోతోంది. ఈ సమావేశంలో భారత్ తన వైఖరిని తెలియజేయాల్సి ఉంటుంది. మోదీ ప్రభుత్వంపై రైతులు ఇప్పటికే పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శనలు, ఆందోళనలు నిర్వహిస్తున్నారు. కనీస మద్దతు ధరలకు చట్టబద్ధత కల్పించాలని, వ్యవసాయ కార్పొరేటీకరణకు స్వస్తి చెప్పాలని వారు ప్రధానంగా డిమాండ్ చేస్తున్నారు. మోదీ ప్రభుత్వం హరిత విప్లవ పితామహుడు ఎంఎస్ స్వామినాథన్‌కు దేశ అత్యున్నత పురస్కారం భారతరత్నను ప్రకటించిన విషయం తెలిసిందే. దేశంలో లక్షలాది మంది రైతుల అభ్యున్నతి కోసం అయన సూచించిన వ్యవసాయ సంస్కరణల్ని అమలు చేయాలని అన్నదాతలు కోరుతున్నారు. రైతుల దీర్ఘకాలిక డిమాండ్‌ను పట్టించుకోని ప్రభుత్వం పేదలకు ఆహార భద్రత కల్పించేందుకు ఆహార ధాన్యాల కొనుగోలు, నిల్వ, పంపిణీ కోసం శాశ్వత పరిష్కారం కనుగొనాలని డబ్ల్యూటీఓలో గట్టిగా వాదిస్తుందని ఎలా అనుకోగలమని అంటున్నారు. ఈ నెల 26న అబుధాబీలో జరిగే డబ్ల్యూటీఓ వాణిజ్య మంత్రుల సమావేశానికి వెయ్యి మందికి పైగా ప్రతినిధులు హాజరవుతారు. వ్యవసాయానికి సంబంధించి వర్ధమాన దేశాలు చేస్తున్న డిమాండ్‌ను నెరవేర్చే అవకాశం ఉన్నదా లేదా అనే విషయంపై ఈ సమావేశంలో నిర్ణయం తీసుకుంటారు. ఈ సమావేశంలో అమెరికా, యూరోపియన్ యూనియన్, చైనా పలు అంశాలను ప్రస్తావించే అవకాశం ఉన్నదని చెబుతున్నారు. ప్రపంచంలో మెజారిటీ ప్రజలను ఆందోళనకు గురి చేస్తున్న ప్రధాన అంశం ఆహార భద్రత. దీనికి ప్రభుత్వాలు గ్యారంటీ ఇవ్వగలవా అనేదే ప్రశ్న.డబ్ల్యూటిఓ ప్రస్తుత నిబంధనలు వర్ధమాన దేశాల ప్రయోజనాల కన్నా సంపన్న దేశాల ప్రయోజనాలకే ప్రాధాన్యమిస్తున్నాయి. ఈ నిబంధనలను సవరించే యత్నాలను అమెరికా, ఈయూ, జపాన్, స్విట్జర్లాండ్, నార్వే, కెనడా తదితర దేశాలు అనుమతించవు. మోదీ ప్రభుత్వం అమెరికా ఒత్తిళ్లకు తలొగ్గి దేశ ప్రయోజనాలపై రాజీ పడినా ఆశ్చర్యం లేదు. ఆహార భద్రతకు శాశ్వత పరిష్కారం కనుగొనాలన్న డిమాండ్‌ను అమెరికా వ్యతిరేకిస్తోంది. ఇండోనేషియా నేతృత్వంలోని జీ-33 దేశాలు, ఆఫ్రికా గ్రూపు సహా వర్ధమాన దేశాలు శాశ్వత పరిష్కారం కోసం డిమాండ్ చేస్తున్నాయి. అయితే ఈ దేశాలు ఇప్పుడు భారత్ వైపు చూస్తున్నాయి. భారత్ ముందుండి తమను నడిపించాలని అవి కోరుకుంటున్నాయి. అయితే వాణిజ్య ఒప్పందాలకు కట్టుబడి ఉ ఒడే విషయంలో మోదీ ప్రభుత్వ రికార్డు దారుణంగా ఉంది. 2015లో వాణిజ్య మంత్రిగా ఉన్న ప్రస్తుత ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఎలాంటి ప్రతిఘటన చూపకుండానే అమెరికాకు దాసోహమన్నారు. ఏదేమైనా మరో రెండు నెలల్లో దేశంలో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో మోదీ ప్రభుత్వం రైతుల పక్షాన నిలుస్తుందా లేక దేశీయంగా, అంతర్జాతీయంగా కాడి కింద పడేసి అమెరికాకు లొంగిపోతుందా అన్నది వేచి చూడాల్సిందే.

# ధర్నా చేస్తుంటే రైతుల్ని పట్టించుకోరా?

**డిమాండ్లు పరిష్కరించాలని మాత్రమే అడుగుతున్నారు**

**కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రైతుల కోసం "ఎంఎస్‌పీ" చట్టం**

**కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్‌గాంధీ**

న్యూఢిల్లీ, : డిమాండ్ల పరిష్కారం కోసం ఢిల్లీలో నిరసన చేపడుతున్న అన్నదాతలపై టియర్ గ్యాస్ ప్రయోగించడాన్ని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్‌గాంధీ తప్పుపట్టారు. రాహుల్ చేపట్టిన భారత్ జోడో న్యాయ యాత్ర ప్రస్తుతం ఛత్తీస్‌గఢ్‌లో కొనసాగుతోంది. తాజాగా అయన ఓ బహిరంగ సభలో మాట్లాడుతూ రైతులు చేపట్టిన చలో ఢిల్లీ కార్యక్రమంపై స్పందించారు. రైతులు కేవలం తమ డిమాండ్లు పరిష్కరించాలని మాత్రమే అడుగుతున్నారని తెలిపారు. బీజేపీ ప్రభుత్వం ఎంఎస్ స్వామినాథన్‌కు భారతరత్న ప్రకటించారు కానీ అయన చెప్పిన దానిని అమలు చేయడానికి మాత్రం సిద్ధంగా లేరని విమర్శించారు. రైతుల డిమాండ్లు న్యాయబద్ధమైనవి అని పేర్కొన్నారు. కానీ బీజేపీ ప్రభుత్వం మాత్రం దానిని అమలు చేయడానికి సిద్ధంగా లేదని చెప్పుకొచ్చారు. ఇండియా కూటమి అధికారంలోకి రాగానే రైతుల హామీలు నెరవేరుస్తామని హామీ ఇచ్చారు. అంతేకాదు స్వామినాథన్ చెప్పినట్లుగా అమలు చేస్తామని రాహుల్ భరోసా ఇచ్చారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే స్వామినాథన్ కమీషన్ ప్రకారం పంటకలు మద్దతు ధర(ఎంఎస్‌పీ)పై చట్టం చేస్తామని మంగళవారం హామీ ఇచ్చారు. ఈ ప్రకటన చారిత్రాత్మకమని, 15 కోట్ల మంది రైతు కుటుంబాలకు భరోసా కల్పించడం ద్వారా వారి జీవితాలను మారుస్తామని రాహుల్ గాంధీ అన్నారు. న్యాయమార్గంలో కాంగ్రెస్ మొదటి హామీ ఇదే అని అయన అన్నారు. ఛత్తీస్‌గఢ్‌లోని అంబికాపూర్ జిల్లాలో జరిగిన 'భారత్ జోడో న్యాయ్ యాత్ర'లో భాగంగా కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున్ ఖర్గే కూడా ఇలాంటి హామీలు ఇచ్చారు.

# మాదక ద్రవ్యాలపై ఉక్కుపాదం మోపాలి

## జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జె పాటిల్

సిద్దిపేట యదార్థవాది ప్రతినిధి, ఫిబ్రవరి 13:: జిల్లాలో గుడుంబా, గంజాయి, డ్రగ్స్ ఇతరత్రా మత్తు పదార్థాలు వాడకుండా స్పెషల్ డ్రైవ్ నిర్వహించి, సరఫరా, వినియోగాన్ని పూర్తిగా రూపుమాపాలని జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జె పాటిల్ అన్నారు. కలెక్టరేట్‌లో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మిషన్ పరివర్తన కార్యక్రమం అమలు ప్రక్రియ పై పోలీస్ కమిషనర్ అనురాధతో కలిసి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...విద్యార్థులు డ్రగ్స్‌కు బానిస కాకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు చూడాలన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్లు, కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు కలిసి యాంటీ డ్రగ్ కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. విద్యాసంస్థల సమీపంలో మాదకద్రవ్యాల సరఫరా పై, యాజమాన్యం బాధ్యత వహించాలన్నారు. మత్తు పదార్థాలు సేవించినట్లు, సరఫరా చేసినట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. మెడికల్ దుకాణాల్లో డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా స్లీపింగ్ టాబ్లెట్స్ అమ్మకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. డీ - అడిక్షన్ సెంటర్లను ప్రారంభించాలని డీడబ్ల్యూవోకి, డ్రగ్స్



వినియోగం, అమ్మకాల సమాచారం అందించడానికి వీలుగా కమిషనరేట్ టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేయాలని సీపీకి కలెక్టర్ సూచించారు. పోలీస్ కమిషనర్ అనురాధ మాట్లాడుతూ. .గంజాయి రవాణా హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ మండలాల్లో ఉన్నట్లు దృష్టికి వచ్చినట్లు తెలిపారు. అనంతరం డ్రగ్ ఈజ్ బిగ్, సే గుడ్ బాయ్ డ్రగ్స్ గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాసమూర్తి, డ్రగ్స్ ఇన్స్ స్పెక్టర్ వినయ్ సుస్మిత, డీఎఫ్ఓ శ్రీనివాస్, డీడబ్ల్యూఓ రామ్ గోపాల్ రెడ్డి, డీఈఓ శ్రీనివాస్ రెడ్డి, సిద్దిపేట గజ్వేల్ ఆర్డీవోలు రమేష్ బాబు, బన్సీలాల్, డీఎంహెచ్ఓ కాశీనాథ్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రజలకు నిజాలు చెప్పాల్సిన అవసరం తమపై ఉంది

***కేంద్రం పెత్తనాన్ని బీఆర్ఎస్ గత పదేండ్లుగా అడ్డుకున్నది***

***అంధకారంలో తెలంగాణ రైతాంగం భవిష్యత్తు***

***ఎమ్మెల్యే కడియం శ్రీహరి తీవ్ర విమర్శలు***

హైదరాబాద్ యదార్థవాది ప్రతినిధి, ఫిబ్రవరి 13: తెలంగాణ నదీ జలాలపైన కేంద్రం పెత్తనానికి దాసోహమన్న కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరికి నిరసనగా బీఆర్ఎస్ చలో నల్లగొండ సభకు పిలుపునిచ్చింది. ఈ కార్యక్రమంలో కేటీఆర్ తో పాటు సహచర ఎమ్మెల్యేలందరూ బహిరంగ సభకు ప్రత్యేక బస్సులో తరలారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలే కాకుండా.. పార్టీ ఎంపీలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ సీనియర్ నాయకులు కూడా ఉన్నారు. బీఆర్ఎస్ పార్టీ కేంద్ర కార్యాలయమైన తెలంగాణ భవన్ నుంచి నల్లగొండ సభకు వెళ్లే క్రమంలో మాజీ మంత్రి కడియం శ్రీహరి మీడియా సమావేశం నిర్వహించారు. తెలంగాణ నదీ జలాల పైన కేంద్రం పెత్తనాన్ని గత పది సంవత్సరాలుగా అడ్డుకున్నది బీఆర్ఎస్ ప్రభుత్వం అని చెప్పారు. కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ మాత్రం కేవలం రెండు నెలల్లోనే కృష్ణ, గోదావరి నది జలాల బోర్డులకు నదుల నిర్వహణను అప్పజెప్పిందని తెలిపారు.తెలంగాణ రైతాంగం భవిష్యత్తును అంధకారం చేసే ఈ నిర్ణయానికి వ్యతిరేకంగా బీఆర్ఎస్ గళం ఎత్తిందని పేర్కొన్నారు. నది జలాల పరిరక్షణ కోసం, కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఈరోజు నల్గొండ జిల్లాలో బహిరంగ సభ నిర్వహిస్తున్నామన్నారు. బీఆర్ఎస్ నిర్వహించే బహిరంగ సభకు కాంగ్రెస్ పార్టీ భయపడిందని, మంగళవారం జరిగిన అసెంబ్లీలో తమపై అబద్దాలు ప్రచారం చేసిందన్నారు. తెలంగాణ ప్రజలకు నిజానిజాలు తెలియజేయాల్సిన అవసరం తమపై ఉందన్నారు మాజీ మంత్రి కడియం శ్రీహరి. ఈరోజు మా పార్టీ అధ్యక్షులు తెలంగాణ ప్రజలకు నది జలాల పైన, వాటిని కేంద్రానికి అప్పజెప్పితే వచ్చే నష్టాల పైన సభలో వివరిస్తారని తెలిపారు. తెలంగాణ నదీ జలాల పైన కేంద్రం పెద్దనాన్ని ఎట్టి పరిస్థితులలో ఒప్పుకోమన్నారు. ఈరోజు ప్రారంభమైన జల ఉద్యమం మొదటి అడుగు మాత్రమే అని హెచ్చరించారు. భవిష్యత్తులో ఈ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు.

# అసిస్టెంట్ డైరెక్టర్ హోదాలో మామిండ్ల

**సమాచార శాఖ ప్రధాన కార్యాలయనికి జిల్లా పౌర సంబంధాల అధికారి మామిండ్ల బదిలీ**



హైదరాబాద్ యదార్థవాది ప్రతినిధి, ఫిబ్రవరి 13: ప్రతినిధి సమాచార, పౌర సంబంధాల శాఖ హైదరాబాద్ ప్రధాన కార్యాలయనికి జిల్లా పౌర సంబంధాల అధికారి మామిండ్ల దశరథం బదిలీ అయ్యారు. మంగళవారం సమాచార, పౌర సంబంధాల శాఖ కమిషనర్ ఎం హనుమంత రావు ను మర్యాద పూర్వకంగా కలిసిన అసిస్టెంట్ డైరెక్టర్ మామిండ్ల దశరథం. ఎన్నికల బదిలీల నేపథ్యంలో జిల్లా పౌర సంబంధాల అధికారి దశరథం బదిలీ అయ్యారు. ప్రస్తుతం సమాచార ప్రధాన కార్యాలయం లో అసిస్టెంట్ డైరెక్టర్ హోదాలో మామిండ్ల దశరథం కొనసాగుతూ జిల్లా ఇంచార్జీ బాధ్యతలు చూస్తున్నారు. ఇదే జిల్లా కోనరావుపేట మండలం కొలనూర్ వీరి స్వగ్రామం. రాజన్న సిరిసిల్ల జిల్లా పౌర సంబంధాల అధికారిగా ఐదున్నర సంవత్సరాలు గా మామిండ్ల దశరథం సేవలు అందించారు. సిద్దిపేట కామారెడ్డి కరీంనగర్ జగిత్యాల జిల్లా పౌర సంబంధాల అధికారి గానూ పని చేశారు. అందరితో ఫ్రెండ్లీగా ఉ ఒటూ ఆఫీసర్ గా పేరు తెచ్చుకున్నారు. గతంలో కీలకంగా ఉన్న సిద్దిపేట రాజన్న సిరిసిల్ల జిల్లాలో సమర్థవంతంగా పని చేశారు. ప్రభుత్వ పథకాలపై ప్రజలను చైతన్యం చేసేందుకు ప్రత్యేక డాక్యుమెంటరీ లు రూపొందించారు. మీడియా ను ఎప్పటి కప్పుడు సమన్వయం చేస్తూ ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేర్చడంలో విశేష కృషి చేశారు. కరీంనగర్ జిల్లా అదనపుపౌర సంబంధాల అధికారినీ శారద ను ఇక్కడికి బదిలీ చేసి ఇంచార్జీ జిల్లా పౌర సంబంధాల అధికారి గా నియమించారు.

# కంఫర్ట్ వినయ్ కి విద్యారత్న అవార్డు ప్రధానం

కమాన్ పూర్ యదార్థవాది ప్రతినిధి, ఫిబ్రవరి 13: కమాన్ పూర్ మండల కేంద్రంలోని ఇంగ్లీష్ పాఠశాల కంఫర్ట్ వినయ్ సౌమ్య దంపతులకు విద్యారత్న అవార్డును ప్రముఖ డాన్స్ మాస్టర్ దేవా అందజేశారు.కమాన్ పూర్ మండల కేంద్రము లోని మొదటి ఆంగ్ల మధ్యమ పాటశాల కంఫర్ట్ గ్రామర్ స్కూల్ 2001 వ సంవత్సరంలో స్థాపించి ఆహ్లాదకరమైన వాతావరణంలో ,స్వంత భవనంలో కార్పొరేట్ కు దీటుగా విద్యనందిస్తు,మంచి క్రమశిక్షణతో ఉత్తమ ఫలితాలు సాధిస్తూ,కమాన్ పూర్ చుట్టూ ప్రక్కల గ్రామాలకు అతి తక్కువ ఫీజులతో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో విధ్యనందించి వారిని డాక్టర్లు గా,లాయర్లు గా, ఇంజనీర్లు గా,తయారుచేశారు.ఇట్టి సేవలను గుర్తించి బిట్ బిట్ డాన్స్ అకాడమి దేవకళా బృందం అధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర పురస్కారం విధ్యారత్న అవార్డును పులిపాక దేవ మరియు వీర్ల ప్రశాంత్ అధ్వర్యంలో పాటశాల ప్రిన్సిపాల్ అర్ణకొండ వినయ్ కుమార్, కరస్పాండెంట్ సౌమ్య ని సత్కరించడం జరిగింది.

# సీఎంతో జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ భేటీ



హైదరాబాద్ యదార్థవాది ప్రతినిధి, ఫిబ్రవరి 13: తెలంగాణలో కాంగ్రెస్ అధికారం అధిష్ఠించిన నాటి నుంచి అనేక మంది బీఆర్ఎస్ నాయకులు సీఎం రేవంత్ రెడ్డిని కలుస్తున్నారు. అదే తరుణంలో మరో బీఆర్ఎస్ నాయకురాలు కూడా అదే బాట పట్టారు. గ్రేటర్ హైదరాబాద్ డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌లు సీఎం రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశామన్నారు. గత కొంత కాలంగా బీఆర్ఎస్‌లో అసంతృప్తిగా ఉన్న శ్రీలత.. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ తరపునుంచి బరిలో నిలవాలని భావిస్తున్నట్లు సమాచారం. అందులో భాగంగానే సికింద్రాబాద్ నుంచి లోక్‌సభ టికెట్‌ను ఆశిస్తున్నట్లు తెలుస్తున్నపట్టికి.. దీనిపై ఎలాంటి స్పష్టత రాలేదు. భవిష్యత్తులో దీనిపై క్లారిటీ వచ్చే అవకాశం ఉంది. బీఆర్ఎస్ తెలంగాణలో అధికారం కోల్పోయినప్పటినుంచి ఆ పార్టీ నాయకుల్లో అనేక మంది కాంగ్రెస్ కండువా కప్పుకునేందుకు ఆశక్తి చూపుతున్నారు. అప్పట్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు నలుగురు రేవంత్ రెడ్డిని కలవడంపై పెద చర్చే జరిగింది. అయితే, తమ నియోజకవర్గల్లో అభివృద్ధిపై నిధులు మంజూరు చేయాలని కోరేందుకే సీఎంను కాలిశాము తప్ప పార్టీ మారే ఉద్దేశం లేదని వారు చెప్పుకోచ్చారు. జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి కూడా సీఎంను కలిసి.. హైదరాబాద్‌లోని పలు ప్రాజెక్టుల గురించి అయనతో చర్చించినట్లు తెలిపారు. అంతే కాదు కేటీఆర్‌తో అత్యంత సన్నిహితంగా మెలిగిన వారిలో ఒకరు మాజీ జీహెచ్ఎంసీ మేయర్ బొంతు రామ్మోహన్. అయన కూడా ముఖ్యమంత్రిని కలిసి.. మల్కాజ్‌గిరి లేద సికింద్రాబాద్ లోక్‌సభ టికెట్ ఆశిన్తున్నట్లు రాజకీయ వార్గాల్లో చర్చలు వినిపిస్తున్నాయి.రామ్మోహన్ కలిసిన వారం వ్యవధిలోనే ఇప్పుడు డిప్యూటీ మేయర్ దంపతులు ముఖ్యమంత్రిని కలవడంతో ఇంకెంతమంది పార్టీని వీడనున్నారు అనే సందేహాలు మొదలైయ్యాయి. గత ఎన్నికల్లో జీహెచ్ఎంసీలో తక్కువ సీట్లు సాధించిన హస్తం పార్టీ.. ఈ సారి గెలుపే లక్ష్యంగా వ్యూహాలు సిద్దం చేస్తోంది. అందులో భాగంగానే ఈ చర్చలు జరుగుతున్నాయని పార్టీ వర్గల్లో చర్చలు సాగుతున్న.. వీటిపై మరి కొన్ని రోజుల్లో స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

# తెలంగాణలో బదిలీల పర్వం

**40 మంది మున్సిపల్ కమిషనర్లకు స్థాన చలనం**




హైదరాబాద్ యదార్థవాది ప్రతినిధి, ఫిబ్రవరి 13: తెలంగాణలో అధికారుల బదిలీల పర్వం కొనసాగుతోంది. తాజాగా 40 మంది మున్సిపల్ కమిషనర్లను ప్రభుత్వం బదిలీ చేసింది. బుధవారంలోగా బదిలీ చేసిన కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఈ 40 మంది మున్సిపల్ కమిషనర్లు బుధవారమే కొత్త కార్యాలయంలో బాధ్యతలు తీసుకోవాలి. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో అధికారుల బదీల ప్రక్రియ కొనసాగుతోంది. చాలా శాఖల్లోనూ అధికారులకు స్థానచలనం కలుగుతోంది. ఇప్పటికే పంచాయతీరాజ్ శాఖలోకి 395 మంది ఎంపీడీవోలను సర్కార్ వేరే చోటుకి పంపింది. అలాగే ఎక్సైజ్ శాఖలోనూ భారీగా బదిలీలు జరిగాయి.మరో రెండు నెలల్లో పార్లమెంట్ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఈ బదిలీలు జరుగుతున్నాయి. ఈసీ మార్గదర్శకాలతో ప్రభుత్వం 14 మంది ఎక్సైజ్ సూపరింటెండెంట్లకు స్థాన చలనం కల్పించింది. ఈ క్రమంలోనే తాజాగా కాంగ్రెస్ సర్కార్ 40 మంది మున్సిపల్ కమిషర్లను బదిలీ చేసింది.రానున్న రోజుల్లో మరికొన్ని శాఖల్లోనూ అధికారులకు స్థానచలనం జరిగే అవకాశాలున్నాయి. సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ విడుదలకు ముందు ఎన్నికల విధులకు అనుబంధంగా ఉండే శాఖల్లోకి అధికారులను బదిలీ చేసే అవకాశం ఉంది. త్వరలోనే ఎన్నికల షెడ్యూల్ వస్తుందని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో బదిలీల ప్రక్రియను మరింత వేగవంతం చేశారు.

# ఆకతాయి పనులు మానకుంటే కఠిన చర్యలు తప్పవు

## -చెన్నూర్ పట్టణ సిఐ రవీందర్

చెన్నూర్ యదార్థవాది ప్రతినిధి ఫిబ్రవరి 13: ఆకతాయి పనులు మానకుంటే కఠిన చర్యలు తప్పవని చెన్నూరు పట్టణ సిఐ రవీందర్ గత కొంత కాలంగా ద్విచక్ర వాహనాలను నిర్లక్ష్యంగా నడుపుతూ, ప్రజలతో పాటు యువతులను ఇబ్బందులకు గురి చేసే పలువురు ఆకతాయిలకు తల్లిదండ్రుల సమక్ష్యంలో కౌన్సిలింగ్ నిర్వహించారు. ఆకతాయి చర్యలకు పాల్పడుతూ బంగారు జీవితాలను నాశనం చేసుకోవద్దని, కన్న తల్లిదండ్రులకు కడుపుకోత మిగిల్చే దుస్థితి రాకూడదని, ఇకనైనా ఆకతాయి చర్యలు మానుకొని భవిష్యత్తుపై దృష్టి సారించాలని సిఐ రవీందర్ సూచించారు.

EDITOR, PRINTED, PUBLISHED AND OWNER, BINGI SATHAIAH YAADHARTHAVAADHI TELUGU DAILY, PRINTED AT MEGHA PRINTERS, H NO.11-52, INDIRA NAGAR, SIDDIPET-502103, YAADHARTHAVAADHI@GMAIL.COM TELTEL/02022,
RNI/2023/85376 # 11-52, INDIRA NAGAR PRASHANTH NAGAR, SIDDIPET-502103, PUBLISHED FROM: H NO.11-52, INDIRA NAGAR, SIDDIPET-502103, TELANGANA STATE. CELL:8500765666, 9491330519.